UDYAM-TS-02-0308842 www.prathighatana.com

# ప్రతిఘటన

తెలుగు దిన పత్రిక జనం కోసం..

హైదరాబాద్ సంపుటి : 1 సంచిక : 26 పేజీలు : 8 శుక్రవారం 20 ఫిబ్రవరి 2026 వెల : 4/-





## ఆరు గ్యారెంటీలకు బడ్జెట్ ఏది?

- ఈ బడ్జెట్ లో నిధులు కేటాయించాలి
- ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొస్తాం
- రైతుల ఖాతాలో నిధులు జమ చేయాలి
- జాబ్ క్యాలెండర్ నిరుద్యోగ భృతి
- ప్రతి నెల 4 నిరుద్యోగ భృతి చెల్లిస్తాం
- సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ

ప్రతిఘటన, హైదరాబాద్

రాష్ట్ర బడ్జెట్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు నిధులు కేటాయించాలని బీఆర్ఎస్ వర్కింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి దాదాపు రెండున్నర ఏళ్ళు అవుతుందన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో 95% పెండింగ్ లో ఉన్నాయని ఈ బడ్జెట్ లో నైనా వాటి అమలుకు నిధులు కేటాయించాలి డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి - మిగతా3లో

## పట్నంలో కమలం.. పల్లెలో గులాబీ



- రాష్ట్ర కాంగ్రెస్ నేతలను అప్రమత్తం చేసిన హైకమాండ్
- కాంగ్రెస్ పటిష్టంగా ఉన్నా, బీఆర్ఎస్, బీజేపీ కూడా బలంగానే ఉన్నాయి
- మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ 29%, బీజేపీ 16% ఓట్లు సాధించాయి
- జాతీయ, ప్రాంతీయ వాదాలతో జనంలోకి వెళ్లే అవకాశాలున్నాయి

న్యూఢిల్లీ

తెలంగాణలో పార్టీ పటిష్టంగా ఉన్నప్పటికీ..ఏమాత్రం ఏమరుపాటు తగదని, ప్రధాన పక్షాలైన బీజేపీ, బీఆర్ఎస్‌లు సైతం బలంగా ఉన్న నేపథ్యంలో మరింత అప్రమత్తతతో వ్యవహరించాలని రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు హైకమాండ్ స్పష్టం చేసింది. సామాజిక న్యాయం అంశంతో కాంగ్రెస్ పార్టీ ముందుకెళున్నప్పటికీ..జాతీయవాదం, ప్రాంతీయ వాదం నినాదాలతో ప్రతిపక్షాలు జనంలోకి వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని హెచ్చరించింది. రెండు పార్టీల ను ఎప్పటికప్పుడు ఐకమత్యంతో సమర్థంగా ఎదుర్కోవాల ని సూచించింది. - మిగతా3లో




## ఎస్ఐఆర్‌కు సన్నాహాకాలు వీలైనంత త్వరగా పూర్తి చేయాలి

- 22రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఈసీ సూచన
- బిహార్‌లో పూర్తైన ఎస్ఐఆర్ ప్రక్రియ
- మరో 9 రాష్ట్రాల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్



## ఉచిత పథకాల వల్ల రాష్ట్రాల అభివృద్ధికి విఘాతం

- ఉచిత పథకాలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- ఉపాధి అవకాశాల సృష్టిపై దృష్టి పెట్టాలని సూచన

## మే మొదటి వారంలో కొత్త పార్టీని ప్రకటిస్తాం



- ఎన్నికల్లో పోటీకి నా మొదటి ఛాయిస్ సిద్ధిపేట.. ఆ తరువాత బోధన్
- జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తాం
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటన

ప్రతిఘటన, హైదరాబాద్

ఈ ఏడాది మేలో కొత్త పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. హైదరాబాద్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. పార్టీ పేరుపై కీలక ప్రకటన చేశారు. మే మొదటి వారంలో ముహూర్తం చూసుకుని పార్టీ పేరు ప్రకటిస్తామని, పార్టీ పేరులో తెలంగాణ ఉంటుందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని.. నా మొదటి ఛాయిస్ - మిగతా3లో



## కర్రెగుట్టల్లో ఎన్‌కౌంటర్

### ఐదుగురు మావోయిస్టులు మృతి

### మృతుల్లో మావోయిస్టు అగ్రనేతలు ?

ప్రతిఘటన, హైదరాబాద్

ఛత్తీస్‌గఢ్–తెలంగాణ సరిహద్దులో మళ్లీ కాల్పుల మోత వినిపించింది. కర్రెగుట్టల్లో జరిగిన ఎదురుకాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు ప్రాథమిక సమాచారం అందింది. మృతుల - మిగతా3లో



## ఏఐను చూసి కొందరు భయపడుతున్నారు

- మేం అందులోనే భారత్ భవిష్యత్తును చూస్తున్నాం
- ఏఐ ఇంపాక్ట్ సదస్సులో ప్రధాని మోదీ కీలకోపన్యాసం
- ఏఐ సదస్సును చూసి గ్లోబల్ సౌత్ గర్విస్తోందని వెల్లడి


## అవినీతి మంత్రుల చిట్టా తమ వద్ద ఉంది

- మంత్రుల అవినీతి, వారికి చెంచాగిరి చేస్తున్న ఐఏఎస్ అధికారుల జాబితా మా వద్ద ఉంది
- ఢిల్లీ పెద్దలకు మూటలు పంపించడానికే కాంగ్రెస్ అధికారంలో ఉందని విమర్శ
- 2029 నాటికి దేశంలో ఏ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండదని జోస్యం



హైదరాబాద్

తెలంగాణ కాంగ్రెస్ మంత్రుల అవినీతి చిట్టా తమ వద్ద ఉందని, ఇంకా బయటకు తీస్తున్నామని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. మంత్రులు చేస్తున్న అవినీతి ఆధారాలను సేకరిస్తున్నామని, ఈ మంత్రులకు కొందరు ఐఏఎస్ అధికారులు చెంచాగిరి చేస్తున్నారని ఆరోపించారు. మంత్రులకు చెంచాగిరి చేస్తున్న అధికారులు వాళ్లు - మిగతా3లో




## బ్లాక్ బాక్స్ కాదు గ్లాస్ బాక్స్ విధానం కావాలి

- ఏఐ వినియోగానికి మోదీ 3సూచనలు
- ఏఐ నైతిక వినియోగానికి సమగ్ర రోడ్ మ్యాప్‌ను రూపొందించాల్సిన అవసరం ఉందన్న మోదీ
- మానవ విలువలు, సరైన మార్గదర్శకత్వం లేకుండా సాంకేతికతను ఉపయోగిస్తే అది స్వీయ విధ్వంసకరంగా మారవచ్చు
- డేటా సార్వభౌమత్వాన్ని గౌరవించడం సహా పారదర్శక భద్రతా నియమాలను రూపొందించాలి

## ఈసారి రసవత్తరంగా బడ్జెట్ సమావేశాలు

- ఈ నెల 26 నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు - 28న బడ్జెట్!
- ఈ నెల 23న కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం
- ఈనెల 26 నుంచి అసెంబ్లీ సమావేశాలు ఉండే అవకాశం
- 10-15 రోజులు బడ్జెట్ సమావేశాలు నిర్వహించే యోచనలో ప్రభుత్వం



హైదరాబాద్

ఈ నెల 26 నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ వర్గాల విశ్వసనీయ సమాచారం. దానిపై ఈనెల 23న జరగబోయే కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 28న అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ఈ సమావేశాలు దాదాపు 10 నుంచి 15 రోజులు నిర్వహించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఈసారి బడ్జెట్ సమావేశాల్లో ప్రశ్నోత్తరాల సమయం మరింత ఆసక్తిగా ఉండనుంది. ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీలు ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టాలని చూస్తున్నాయి. 6 గ్యారెంటీల అమలు 13 అంశాల హామీలపై తదితర రాష్ట్రంలో నెలకొన్న సాగునీటి ప్రాజెక్టులు, యూరియా కొరత, ఉద్యోగ నియామకాలు, హిల్ట్ పాలసీ వంటి సమస్యలపై - మిగతా3లో

ప్రతిఘటన
తెలుగు దిన పత్రిక
శుక్రవారం 20 ఫిబ్రవరి 2026

## ఎస్ఐఆర్‌కు సన్నాహకాలు

## వీలైనంత త్వరగా పూర్తి చేయాలి’

ఓటరు జాబితాకు సంబంధించి దేశవ్యాప్తంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) నిర్వహించనున్నట్లు ప్రకటించిన ఎన్నికల కమిషన్ ఆ దిశగా చర్యలను ముమ్మరం చేసింది. ఎస్ఐఆర్‌కు సంబంధించి సన్నాహక పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని 22 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఈసీ సూచించింది. ఏప్రిల్ నుంచి ఎస్ఐఆర్ మొదలయ్యే అవకాశం ఉంది. 22 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎస్ఐఆర్ పూర్తయితే దేశమంతా ఆ ప్రక్రియ సంపూర్ణమవుతుంది. ఎస్ఐఆర్ ప్రక్రియ బిహార్‌లో పూర్తి కాగా మరో 9 రాష్ట్రాల్లో కొనసాగుతోంది. అసోంలో ఎస్ఐఆర్ స్థానంలో నిర్వహించిన ఎస్ఆర్ ఈనెల 10న పూర్తయినట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది.

## ఏఐను చూసి కొందరు భయపడుతున్నారు

ఆర్టిఫిషియల్ ఇంటెలీజెన్స్ (ఏఐ) టెక్నాలజీని చూసి కొందరు భయపడుతున్నారని, కానీ అందులో దేశ భవిష్యత్తును భారత్ చూస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. దేశ భవిష్యత్ వికాసంలో మైలురాయిలా ఏఐ నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సానుకూల, ఆశావాద దృక్పథంతో ఏఐ ఆవిష్కరణలను భారత్ స్వాగతిస్తోందన్నారు. ఏఐ ఇంపాక్ట్ సదస్సు-2026లో భాగంగా గురువారం ఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన ముఖ్య కార్యక్రమాన్ని ఉద్దేశించి మోదీ కీలకోపన్యాసం ఇచ్చారు. ప్రపంచంలో ఆర్టిఫిషియల్ ఇంటెలీజెన్స్ (ఏఐ) టెక్నాలజీ ప్రజాస్వామికీకరణ జరగాలని భారత్ కోరుకుంటోందని ప్రధానమంత్రి వెల్లడించారు. ప్రత్యేకించి గ్లోబల్ సౌత్ దేశాలకూ ఏఐ ఫలాలు అందాలన్నారు. అందుకే సర్వజన హితాయ, సర్వజన సుఖాయ (అందరి సంక్షేమం, అందరి సంతోషం) అనే థీమ్‌తో ఏఐ ఇంపాక్ట్ సదస్సును భారత్ నిర్వహిస్తోందని తెలిపారు. చారిత్రక ఏఐ సదస్సును భారత్ నిర్వహిస్తుండటం యావత్ గ్లోబల్ సౌత్‌కు గర్వ కారణమన్నారు. కొత్త టెక్నాలజీని తయారు చేయడంతో పాటు దాన్ని అందిపుచ్చుకోవడంలోనూ భారత్ ముందుంటుందని ఆయన తెలిపారు. ప్రపంచంలోనే అత్యధికంగా టెక్ నిపుణులు లభించే కేంద్ర బిందువుగా భారత్ ఎదిగిందన్నారు.

**‘ఏఐకు సరైన దిశ లేకుంటే విధ్వంసమే’**

‘ఆర్టిఫిషియల్ ఇంటెలీజెన్స్ (ఏఐ) అనేది విప్లవాత్మక శక్తి. దానికి సరైన దిశ అనేది లేకుంటే, అదొక విధ్వంసంలా పరిణమిస్తుంది. ఒకవేళ సరైన దిశను ఏఐకు చూపిస్తే, అదొక ఉపయోగకర ఉపకరణంగా మారిపోతుంది. మెషీన్ సెంట్రిక్‌గా ఉన్న ఏఐ టెక్నాలజీని మానవ కేంద్రిత ఉపకరణంగా ఎలా మార్చాలి? సెన్సిటివ్ స్థితిలో ఉన్న ఏఐను బాధ్యతాయుత స్థితిలోకి ఎలా తీసుకెళ్లాలి? ఈ అంశాలపై చర్చించడం, తగిన పరిష్కారాలను కనుగొనడమే భారత్ నిర్వహిస్తున్న గ్లోబల్ ఏఐ ఇంపాక్ట్ సదస్సు ప్రధాన లక్ష్యం. అందరి సంక్షేమం, అందరి సంతోషం అనే థీమ్‌తో ఈ సదస్సును మేం నిర్వహిస్తున్నాం. దీన్నిబట్టి ఏఐను భారత్ ఎలా చూస్తోందో అందరూ స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు. మేం అందరి సంక్షేమం, అందరి సంతోషం కోసమే ఏఐను వినియోగిస్తాం’ అని ప్రధాని మోదీ వెల్లడించారు.

**అణుశక్తిలాగే ఏఐకీ రెండు కోణాలు : మోదీ**

‘అత్యుత్తమ దేశ నిర్మాణానికి కూడా ఏఐ టెక్నాలజీ ఉపయోగపడుతుంది. ఈవిషయంలో ఏఐ పరిశ్రమతో ప్రపంచ దేశాలు కలిసి పనిచేయాలి. ప్రస్తుతానికి ఏఐతో దేశం కోసం ఏమేం చేయగలం అనేది ఆలోచించాలి. భావితరాలకు ఎటువంటి ఏఐ టెక్నాలజీని అందించాలి అనే దానిపైనా మనం శ్రద్ధ పెట్టాలి. ప్రతి టెక్నాలజీలోనూ మంచి, చెడు అనే రెండు కోణాలు ఉంటాయి. అణుశక్తి కలిగిన అణుబాంబును వినియోగించడం వల్ల జరిగిన విధ్వంసాన్ని మనం చూశాం. ఇప్పుడు అదే అణు ఇంధనంతో మనం జీవితాలను మార్చుకుంటున్నాం. అందరి సంక్షేమానికి ఉపయోగపడే ఏఐ ఈ ప్రపంచానికి కావాలి’ అని ప్రధాని మోదీ తెలిపారు.

**జీపీఎస్‌లా ఏఐను మన కంట్రోల్‌లో పెట్టుకోవాలి**

‘ఏఐ టెక్నాలజీ అనేది మానవ సామర్థ్యాలను పెంచుతుంది. దీన్ని అందిపుచ్చుకునేందుకు మనం కొత్త నైపుణ్యాలను నేర్చుకోవాలి. ఇప్పటికే ఉన్న స్కిల్స్‌ను మెరుగుపర్చుకోవాలి. జీవితాంతం కొత్తకొత్త అంశాలను నేర్చుకుంటూ ముందుకుసాగాలి. తద్వారా మానవ కేంద్రిత ఏఐ సాకారం అవుతుంది. ఏఐ దృష్టిలో మనుషులు కేవలం డేటా పాయింట్స్ లాంటివారు. అందుకే ఏఐ టెక్నాలజీని ప్రపంచంలో అందరికీ అందుబాటులోకి తేవాలి. ఆకాశమే హద్దుగా వ్యాపించే అవకాశాన్ని ఏఐకు మనం ఇవ్వాలి. కాకపోతే, జీపీఎస్‌లా దాని కమాండ్‌ను మన చేతుల్లోనే పెట్టుకోవాలి. మనకు అవసరమైనప్పుడే జీపీఎస్‌ను వినియోగిస్తాం. లేదంటే వినియోగించం. డీప్ ఫేక్స్ కట్టడి, ఏఐ జనరేటెడ్ కంటెంట్‌పై మార్గదర్శకాలు వంటి విషయాల్లో వెంటనే అంతర్జాతీయ ప్రమాణాల రూపకల్పన జరగాలి. డీప్ ఫేక్స్, ఏఐ జనరేటెడ్ కంటెంట్‌తో సామాజిక అస్థిరతను క్రియేట్ చేసే ముప్పు ఉంటుంది. అందుకే ప్రజలు అసలైన కంటెంట్‌ను, ఏఐ కంటెంట్‌ను నిర్దిష్టంగా గుర్తించేలా ప్రత్యేక లేబుల్స్‌ను తప్పక వినియోగించాలి’ అని ప్రధాని మోదీ చెప్పారు.

**తొలి వైర్‌లెస్ సిగ్నల్ లాంటిదే ఏఐ విప్లవం : మోదీ**

‘ప్రపంచంలోనే తొలిసారిగా టెలికాం వైర్‌లెస్ సిగ్నల్స్‌ను ప్రసారం చేసిన రోజున, యావత్ ప్రపంచం ఈజీగా లైవ్‌లో కనెక్ట్ కాగలదని ఏ ఒక్కరూ ఊహించలేకపోయారు. ఏఐ టెక్నాలజీ కూడా మానవ చరిత్రలో అలాంటి పెను విప్లవమే. ప్రస్తుతం మనం చూస్తున్నది, అంచనా వేస్తున్నది, కేవలం ఏఐ తొలి ప్రభావాన్ని మాత్రమే. ప్రజా ప్రయోజనకర ఉపకరణంగా ఏఐను భారత్ చూస్తోంది. ఏఐ టెక్నాలజీ మెషీన్లను ఇంటెలీజెంట్లుగా మార్చేస్తోంది. దీంతోపాటు అది మానవ సామర్థ్యాలనూ చాలారెట్లు పెంచుతోంది. కానీ ఒకేఒక తేడా ఉంది. వేగం, సామర్థ్యం విషయంలో ఏఐ అందరి అంచనాలను మించిపోయింది. గతంలో సమాజంపై టెక్నాలజీ ప్రభావం కనిపించడానికి దశాబ్దాల సమయం పట్టేది. ఇప్పుడు మెషీన్ లెర్నింగ్ నుంచి లెర్నింగ్ మెషీన్స్ వరకు అంతా వేగంగా, సమగ్రంగా, స్థూలంగా జరిగిపోతోంది’ అని ప్రధాని మోదీ చెప్పారు.

## ముందస్తు అనుమతి తీసుకోకుండా

## దేశం విడిచి వెళ్లను

## సుప్రీంకోర్టుకు అనిల్ అంబానీ

ముందస్తు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లనని, రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ సుప్రీంకోర్టు తెలియజేశారు. అనిల్ ధీరూభాయ్ అంబానీ గ్రూప్ ప్రమేయం ఉందని ఆరోపణలున్న రూ.40,000 కోట్ల బ్యాంకింగ్, కార్పొరేట్ మోసంపై ఏజెన్సీల దర్యాప్తుకు పూర్తిగా సహకరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. చట్టం నుంచి తప్పించుకునే ఉద్దేశం తనకు లేదని, తాను అలాంటి వ్యక్తిని కాదని అనిల్? అంబానీ పేర్కొన్నారు.

“2025 జులై నుంచి ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు జరుగుతోంది. అయితే, అప్పటినుంచి నేను దేశం విడిచి వెళ్లలేదు. ప్రస్తుతం దేశం విడిచి వెళ్లే ఉద్దేశం లేదు. ఒకవేళ భవిష్యత్తులో వెళ్లాల్సివస్తే, కోర్టు నుంచి ముందస్తు అనుమతి పొందుతాను. దర్యాప్తు బృందాలకు నేను అత్యంత నిజాయతీతో పూర్తిగా సహకరిస్తున్నాను. అలాగే కొనసాగిస్తాను.” అని అనిల్ అంబానీ పేర్కొన్నారు.


**‘దర్యాప్తునకు నేను పూర్తిగా సహకరిస్తా’**

అయితే, అనిల్ అంబానీ విదేశాలకు పారిపోయే అవకాశం ఉందని, ఈ కేసుల్లో సత్వర, నిష్పాక్షిక దర్యాప్తు చేపట్టాలని కోరుతూ మాజీ అధికారి ఈఏఎస్ శర్మ దాఖలు చేసిన పిల్‌కు ప్రతిస్పందనగా అనిల్ అంబానీ అఫిడవిట్ దాఖలు చేశారు. తన ప్రవర్తన పారదర్శకంగా, సహకారంగా ఉందని నిరూపించడానికి ఈ అఫిడవిట్ దాఖలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. కాగా, అనిల్ అంబానీ చివరగా 2025 ఆగస్టులో ఒకసారి ఈడీ ముందు హాజరయ్యారు. ఇదిలా ఉండగా, ఈ కేసు దర్యాప్తులో జరుగుతున్న జాప్యంపై ఈ నెల 4న న్యాయస్థానం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ కేసులో న్యాయమైన, సత్వర నిష్పాక్షికమైన దర్యాప్తు చేయాలని సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(సీబీఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)లను ఆదేశించింది.

**అనిల్? అంబానీకి ఈడీ నోటీసులు**

మరోవైపు, ఫిబ్రవరి 26న అనిల్? అంబానీ విచారణకు హాజరుకావాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) తాజాగా సమన్లు ??జారీ చేసిందని గురువారం అధికారిక వర్గాలు తెలిపాయి. అనిల్ అంబానీ భార్య టీనా అంబానీ ఈడీ విచారణకు ఈ నెల 17న హాజరు కావాల్సి ఉండగా, మళ్లీ గైర్హాజరు అయ్యారు. మనీలాండరింగ్ కేసులో విచారణ నిమిత్తం ఆమెకు ఈడీ ఇప్పటివరకు రెండు సార్లు సమన్లు జారీ చేసింది. తొలి సమన్ల ప్రకారం ఈనెల 10న ఆమె ఈడీ ఎదుట హాజరు కావాల్సి ఉండగా హాజరు కాలేదు. దీంతో ఈ నెల 17న హాజరు కావాలంటూ మళ్లీ నోటీసులు పంపించారు ఈడీ అధికారులు.

# బ్లాక్ బాక్స్ కాదు గ్లాస్ బాక్స్ విధానం కావాలి




ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌లో అనైతిక ప్రవర్తనకు అవకాశం అపరిమితంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. అందుకోసమే ఏఐ వినియోగానికి సమగ్ర రోడ్ మ్యాప్‌ను రూపొందించాల్సిన అవసరం ఉందని మోదీ అభిప్రాయపడ్డారు. మానవ విలువలు, సరైన మార్గదర్శకత్వం లేకుండా సాంకేతికతను ఉపయోగిస్తే అది స్వీయ విధ్వంసకరంగా మారవచ్చని హెచ్చరించారు. అందుకే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు తప్పనిసరిగా మానవ విలువలు, స్పష్టమైన దిశ ఉండాలని చెప్పారు. ఏఐ ఇంపాక్ట్ సదస్సు 2026లో భాగంగా నిర్వహించిన లీడర్స్ ప్లీనరీలో ప్రధాని మోదీ ప్రసంగించారు. డేటా సార్వభౌమత్వాన్ని గౌరవించడం సహా పారదర్శక భద్రతా నియమాలను రూపొందించాలని సూచించారు. “భారత్ బుద్ధుడు జన్మించిన దేశం. సరైన ఉద్దేశం ఉంటేనే సరైన నిర్ణయాలు ఉంటాయని బుద్ధుడు చెప్పారు. అందుకోసమే అందరూ కలిసి ఏఐని సరిగ్గా వినియోగించుకునేందుకు సమగ్రమైన రోడ్‌మ్యాప్‌ను రూపొందించాల్సిన అవసరం ఉంది. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను అనైతిక పద్ధతిలో వాడుకునేందుకు అపరిమిత అవకాశాలు ఉన్నాయి. వీటన్నింటిని అరికట్టేలా ఏఐ కంపెనీలు చర్యలు తీసుకోవాలి. మనకు బ్లాక్ బాక్స్‌కు బదులుగా గ్లాస్ బాక్స్ విధానం అవసరం. అందులో భద్రతా నియమాలను ధ్రువీకరించవచ్చు. జవాబుదారీతనం మరింత స్పష్టంగా మారుతుంది. వ్యాపారంలో నైతిక ప్రవర్తన కూడా మెరుగపడుతుంది. మనం ాూ×కి ఆకాశమే హద్దుగా ఎదిగే ఆకాశాన్ని ఇవ్వాలి, కానీ అదే సమయంలో మన చేతుల్లోనే పగ్గాలు ఉంచుకోవాలి. కృత్రిమ మేధస్సు అనేది ఒక పరివర్తనాత్మక శక్తి. దీనికి సరైన దిశానిర్దేశం లేకపోతే, అది ఒక పెను వినాశకారిగా మారుతుంది. అదే దానికి సరైన దిశ దొరికితే, అద్భుతమైన పరిష్కారంగా మారుతుంది. ఏఐని యంత్ర-కేంద్రక విధానం నుంచి మానవ-కేంద్రక విధానంగా ఎలా మార్చాలి, దానిని సున్నితంగా, బాధ్యతాయుతంగా ఎలా తీర్చిదిద్దాలి అనేదే ఈ గ్లోబల్ ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ ప్రాథమిక లక్ష్యం.”

ఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహిస్తున్న ఐదు రోజుల ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు 2026లో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. గూగుల్, ఓపెన్ఏఐ, ఆంత్రోపిక్ సీఈవోలు సుందర్ పిచాయ్, సామ్ ఆల్ట్‌మన్, దారియో అమోడీ సహా పలువురు ప్రపంచ టెక్ దిగ్గజాలతో మోదీ గ్రూప్ ఫోటో దిగారు. ఈ సదస్సుకు ఐరాస చీఫ్ అంటోనియో గుటెరెస్, ఫ్రాన్స్, బ్రెజిల్, శ్రీలంక అధ్యక్షులు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్, లులా డాసిల్వా, అనుర కుమార దిసానాయకే సహా భూటాన్, ఫిన్లాండ్, మారిషస్, క్రొయేషియా, సీషెల్స్, సెర్బియా, ఎస్టోనియా దేశాల అధినేతలు హాజరయ్యారు.

**మానవ్ విజన్ ఉండాలని చెప్పిన ప్రధాని మోదీ**

అంతకుముందు కృత్రిమ మేధ వినియోగంలో ‘మానవ్ (హీూచీూ౦) విజన్’ ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఈ విజన్ అర్థం, ఫ్రేమ్‌వర్క్‌ను కూడా ఆయన వివరించారు.

మోరల్ అండ్ ఎథికల్ సిస్టమ్: నైతిక విలువలు, బాధ్యతలను పరిగణనలోకి తీసుకుని ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్? వ్యవస్థలకు మార్గనిర్దేశం చేయాలి.

అకౌంటబుల్: పారదర్శక నిబంధనలు రూపొందించి, జవాబుదారీతనంతో ఏఐ వ్యవస్థలు పనిచేసేలా చూడాలి.

నేషనల్ సావర్నిటీ: ఒక దేశంలో సృష్టించిన డేటా ఆ దేశానికే చెందాలి. ఆ దేశ పరిధిలోనే ఉండేలా చూడాలి.

యాక్సెసిబుల్ అండ్ ఇంక్లూజివ్: ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్? వ్యవస్థలు గుత్తాధిపత్యంతో పని చేయకుండా అన్నివర్గాల వారికీ అందుబాటులోకి రావాలి.

వేలిడ్ అండ్ లెజిటిమేట్: ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్? చట్టబద్ధంగా, విశ్వసనీయమైనదిగా పనిచేయాలి. నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలి.

**ప్రధాని మోదీ ప్రశంసలు**

ఈ క్రమంలోనే యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ సామర్థ్యాన్ని ప్రధాని మోదీ ప్రశంసించారు. అనేక గడ్డు పరిస్థితులను దాటుకుని భారత్? ఇప్పుడు సులభంగా లావాదేవీలు నిర్వహిస్తుందని గుర్తుచేశారు. డిజిటల్? అంతరాన్ని తగ్గించడంలో? యూపీఐ కీలక పాత్ర పోషించిందని చెప్పారు.

# ఉచిత పథకాల వల్ల రాష్ట్రాల అభివృద్ధికి విఘాతం



దేశంలో పెరుగుతున్న ఉచిత పథకాల సంస్కృతిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. దేశ ఆర్థికాభివృద్ధిని దెబ్బతీసే విధంగా ఉచితాల పంపిణీ చేయడం సమంజసం కాదని వ్యాఖ్యనించింది. రాష్ట్రాలు ఉచితాలకంటే ఉపాధి అవకాశాల సృష్టిపై దృష్టి పెట్టాలని సూచించింది. రాష్ట్రాలు ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా పనిచేయాలని ధర్మాసనం స్పష్టం చేసింది. అన్నీ ఉచితంగా పంచుకుంటూపోతే అభివృద్ధి కార్యక్రమాలకు ఒక్క పైసా మిగలదని పేర్కొంది. ఇది ఒక్క తమిళనాడు సమస్యే కాదని, అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని తెలిపింది. ఉచిత ఆహారం, సైకిళ్లు, విద్యుత్‌కు బదులు ఉపాధి సృష్టి కోసం కృషి చేయాలని రాష్ట్రాలకు సుప్రీంకోర్టు సూచించింది. తమిళనాడు ఎన్నికల వేళ డీఎంకే ఉచిత విద్యుత్ ప్రతిపాదనపై దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. ఎలక్ట్రిసిటీ అమెండ్‌మెంట్ రూల్స్-2024లోని రూల్ 23ను సవాలు చేస్తూ తమిళనాడు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను గురువారం భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ బాగ్చీ, జస్టిస్ విపుల్ పంచోలితో కూడిన ధర్మాసనం విచారించింది. తమిళనాడు ప్రభుత్వ తరఫున సీనియర్ అడ్వకేట్ గోపాల్ సుబ్రమణియం వాదనలు వినిపించారు. బిల్లు చెల్లించలేని పేదలకు సహాయం చేయడం అర్థవంతమైన చర్య అని, కానీ, కానీ ఆర్థిక స్థోమత ఉన్నవారికీ, లేనివారికీ తేడా లేకుండా ఉచితాలు ఇవ్వడం సరైందా? అంటూ సీజేఐ ప్రశ్నించారు. ఈ మేరకు తమిళనాడు విద్యుత్? సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై వివరణ ఇవ్వాలంటూ కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. రాష్ట్రాలు అప్పుల్లో ఉండి కూడా డబ్బు పంపిణీ చేయడంపై సీజేఐ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిధులను సాగునీరు, విద్యుత్ వంటి దీర్ఘకాలిక అభివృద్ధి పనులకు ఎందుకు కేటాయించకూడదని అడిగారు. డైరెక్ట్ క్యాష్ ట్రాన్స్‌ఫర్ (నగదు బదిలీ) విధానాలపై కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. ‘ప్రజలు గౌరవంగా బతకడానికి మీరు ఉపాధి మార్గాలను సృష్టించాలి. ఉదయం లేచినప్పటి నుంచి ఉచిత ఆహారం, గ్యాస్, విద్యుత్ ఇస్తూ నేరుగా ఖాతాల్లోకి నగదు జమ చేస్తుంటే, ప్రజలు ఎందుకు పని చేస్తారు? ప్రతిదీ ఉచితంగా దొరుకుతున్నప్పుడు వారు ఏం పని చేస్తారు. మనం చేస్తున్నది దేశ నిర్మాణమేనా?’ అని సీజేఐ ప్రశ్నించారు.

“మేము కేవలం తమిళనాడు గురించి మాత్రమే మాట్లాడటం లేదు. ఇది దేశం మొత్తానికి సంబంధించిన విషయం. మనం ఎలాంటి సంస్కృతిని ప్రోత్సహిస్తున్నాం. విద్యుత్ బిల్లులు చెల్లించగలిగే వారు, అట్టడుగు వర్గాల మధ్య వ్యత్యాసం ఏది? ఒక సంక్షేమ ప్రభుత్వంగా అట్టడుగు వర్గాలకు ఉపశమనం కలిగించాలనుకోవడం మంచిదే. కానీ, చెల్లించే స్థోమత ఉన్నవారిని, లేనివారిని మధ్య ఎటువంటి వ్యత్యాసం చూపకుండా పంపిణీ చేయడం సంతృప్తిపర్చే విధానం కాదా?. దేశవ్యాప్తంగా ఇలా జరుగుతుండటం చూస్తుంటే, మాకు కూడా కొన్నిసార్లు బాధేస్తుంది” - సీజేఐ

**లాభాపేక్ష వద్దు- స్థోమత ఉన్న వారి నుంచి వసూలు చేయండి**

దేశంలోని చాలా రాష్ట్రాలు ఇప్పటికే రెవెన్యూ లోటుతో ఉన్నాయని, అలాంటి పరిస్థితుల్లోనూ అభివృద్ధి కార్యక్రమాలను పక్కనబెట్టి ఉచితాల పంపిణీ చేయడం ఆర్థిక వ్యవస్థకు భారం అవుతుందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఆదాయ మిగులు రాష్ట్రం అయినప్పటికీ, ఆ మొత్తాన్ని రోడ్లు, ఆసుపత్రులు,పాఠశాలల అభివృద్ధికి ఖర్చు చేయాల్సిన బాధ్యత మీకు లేదా? అని తమిళనాడు ప్రభుత్వాన్ని సీజేఐ ప్రశ్నించారు. పిల్లలకు విద్య అందించడం, మెడికల్ కాలేజీల్లో సీట్లు సాధించిన పేద విద్యార్థులకు సహాయం చేయడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతని, అయితే సంపన్నులకు కూడా ఉచితాలు అందడంపై సీజేఐ ప్రశ్నలు కురిపించారు. ఇలాంటి విధానపరమైన అంశాలను రాష్ట్రాలు పునఃసమీక్షించాల్సిన సమయం ఆసన్నం కాలేదా? అని అడిగారు. సేవలు పొందే వ్యక్తి తప్పనిసరిగా చెల్లింపులు చేయాలనేది ప్రాథమిక సూత్రమని సీజేఐ పేర్కొన్నారు. రాష్ట్రాలు లాభాపేక్షతో ఉండాలని తాము చెప్పడం లేదని, కనీసం స్థోమత ఉన్న వారి నుంచి ఖర్చులనైనా వసూలు చేయాలని సూచించారు.

# ‘ఏఐ రంగంలో భారత్ కీలక పాత్ర’



ఢిల్లీలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సులో యూఎన్ చీఫ్ ఆంటోనియో గుటెరస్, గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్, టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ తదితర టెక్ దిగ్గజాలు కీలక ప్రసంగం చేశారు. ఏఐ రంగంలో భారత్ పాత్ర గురించి వ్యాఖ్యానించారు. భారత్‌లో తమ సంస్థ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడుతోందని, అందులో భాగంగా పూర్తి స్థాయి ఏఐ హబ్‌ను ఏర్పాటు చేస్తోందని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ స్పష్టం చేశారు. అలాగే దేశంలోని ప్రతి పౌరుడికి ఏఐ టూల్స్ చేరేలా చేయడమే తమ లక్ష్యమని టీసీఎస్ ఛైర్మన్ చంద్రశేఖరన్ ప్రకటించారు.

**ఏఐ భవిష్యత్‌ను కొందరు నిర్ణయించలేరు: యూఎన్ చీఫ్**

ఈ సదస్సుకు తనను ఆహ్వానించిన భారత ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలిపారు యూఎన్ సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్. ఈ క్రమంలో గ్లోబల్ సౌత్‌లో మొదటి ఏఐ సమ్మిట్‌ను నిర్వహిస్తున్న భారత్‌కు అభినందనలు తెలియజేశారు. భారత్‌లో జరిగే ఈ ఏఐ సమ్మిట్‌కు ప్రత్యేక అర్థం ఉందని చెప్పారు. ఏఐ భవిష్యత్తును కొన్ని దేశాలు లేదా కొంత మంది బిలియనీర్లు నిర్ణయించలేరని స్పష్టం చేశారు. నిజమైన ఇంపాక్ట్ అంటే జీవితాలను మెరుగుపరిచి, భూమిని రక్షించే సాంకేతికత అని అభిప్రాయపడ్డారు.

**దేశంలో మార్పుల వేగాన్ని చూసి ఆశ్చర్యపోతున్నా : సుందర్ పిచాయ్**

తాను భారత్‌ను సందర్శించిన ప్రతిసారీ దేశంలో మార్పుల వేగాన్ని చూసి ఆశ్చర్యపోతున్నానని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ స్పష్టం చేశారు. తాను విద్యార్థిగా ఉన్నప్పుడు చెన్నై నుంచి ఐఐటీ ఖరగ్‌పూర్‌కు కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో విశాఖ మీదుగా వెళ్లేవాడిని తెలిపారు. ఇప్పుడు తీరప్రాంత నగరమైన అదే విశాఖపట్నంలో గూగుల్ ఫుల్ స్టాక్ ఏఐ హబ్ ఏర్పాటు చేస్తోందని వెల్లడించారు. ఈ హబ్ గిగా వాట్ స్కేల్ కంప్యూటర్, కొత్త అంతర్జాతీయ సబ్‌సీ కేబుల్ గేట్‌వేను కలిగి ఉంటుందని అన్నారు. దీని వల్ల యువతకు ఉద్యోగాలు వస్తాయని పేర్కొన్నారు. అలాగే భారత ప్రజలకు అత్యాధునిక ఏఐ అందుబాటులోకి వస్తుందని చెప్పారు.

**ప్రతి పౌరుడికి ఏఐని అందించడమే లక్ష్యం : టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్**

ప్రజలపై ఏఐ చాలా బలమైన ప్రభావాన్ని చూపుతుందని టాటా సన్స్ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ అభిప్రాయపడ్డారు. సమాజంపై తీవ్ర ప్రభావం చూపే తదుపరి ప్రధాన మౌలిక సదుపాయం ఏఐయేనని స్పష్టం చేశారు. దేశంలోని ప్రతి పౌరుడికి ఏఐ టూల్స్ అందేలా చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్యక్రమాలకు భారత్ సాక్షిగా నిలుస్తోందన్నారు.

**‘ప్రపంచంలో సగం డిజిటల్ లావాదేవీలు భారత్‌లోనే’**

అలాగే 140 కోట్ల మంది ప్రజలతో అతిపెద్ద డిజిటల్ ఐడెంటిటీ వ్యవస్థను భారత్ కలిగి ఉందని ఎన్ చంద్రశేఖరన్ స్పష్టం చేశారు. ప్రపంచంలో జరిగే వాటిలో భారత్ నుంచే సగం డిజిటల్ లావాదేవీలు ఉన్నాయని అన్నారు. భారత్‌ను ఏఐ కేంద్రంగా ప్రధాని మోదీ తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. సెమీకాన్ ఇండియా, ఇండియా ఏఐ మిషన్‌లో భాగంగా సాంకేతికత అభివృద్ధి జరుగుతోందని వెల్లడించారు. ఏఐ నైపుణ్య శిక్షణలో భారత్ పురోభివృద్ధి సాధిస్తోందని చెప్పారు.

**118 దేశాలు హాజరు**

గ్లోబల్ సౌత్‌లో మొదటిసారి జరుగుతున్న ఏఐ సమ్మిట్‌లో 118 దేశాలు పాల్గొన్నాయని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ప్రపంచంలో ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద ఏఐ సదస్సు ఇదేనని పేర్కొన్నారు. ఈ సమ్మిట్‌ను విజయవంతం చేసిన దేశాధినేతలు, నాయకులు, టెక్ నిపుణులకు ధన్యవాదాలు వెల్లడించారు. సాంకేతికతను అందరికీ అందుబాటులోకి తీసుకురావడంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ దృష్టి సారించారని చెప్పారు.

**ఏఐతో అవకాశాలతో పాటు సవాళ్లూ ఉన్నాయి : ఆంత్రోపిక్ సీఈఓ**

ఏఐ రంగంలో భారత్ కీలక పాత్ర పోషించనుందని ఆంత్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్ అభిప్రాయపడ్డారు. గత రెండున్నరేళ్లలో ఏఐ రంగంలో భారత్ మంచి పురోగతి సాధించిందని పేర్కొన్నారు. అందుకే ఇటీవల వారంలో బెంగళూరులో తాము ఒక కార్యాలయాన్ని ప్రారంభించామని గుర్తు చేసుకున్నారు. అలాగే ఆంత్రోపిక్ ఇండియా కార్యాలయానికి భారత్‌తో సుదీరఘ వ్యాపార అనుభవం ఉన్న ఇరినా ఘోస్‌ను ఎండీగా నియమించామని తెలిపారు. ఏఐతో అవకాశాలతో పాటు సవాళ్లూ ఉన్నాయని హెచ్చరించారు. ఆ సవాళ్లను పరిష్కరించడంలో భారత్ కీలక పాత్ర పోషించనుందని స్పష్టం చేశారు.

కాగా, ఢిల్లీలోని భారత మండపంలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మెక్రాన్ సైతం పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కృత్రిమ మేధను ఉపయోగించుకోవడంలో దేశంలోని యువత ఆసక్తి చూపిస్తోందని ప్రధాని మోదీ అన్నారు.

# ఆరు గ్యారెంటీలకు బడ్జెట్ ఏది?

-మొదటిపేజీ తరువాయి

గురువారం బహిరంగ లేఖ రాశారు. హామీలను అమలు చేయకపోతే తెలంగాణ సమాజం ఇంకా ఓపిక పట్టే ప్రసక్తే లేదని గుర్తు చేశారు. ఆరు గ్యారెంటీ ల పేరు చెప్పి అధికారంలోకి వచ్చి వాటి అమలును పక్కన పెట్టారని ఆరోపించారు. రెండు బడ్జెట్లలో హామీల అమలు కోసం కేటాయింపులు చేయని ప్రభుత్వం ఈ బడ్జెట్ లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీలో హామీ ఇచ్చిన మహిళలు, వృద్ధులు, విద్యార్థి, యువత, రైతన్నల కోసం భారీగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. డిక్లరేషన్ ల పేరుతో హామీలు ఇచ్చిన మేరకు ఎస్సీ, బీసీ, ఎస్టీ,మైనార్టీలకు బడ్జెట్లో ప్రాధాన్య ఇవ్వాలని, ఆయా వర్గాలకు రెండు సంవత్సరాలుగా ఎగ్గొట్టిన హామీలను.. కాంగ్రెస్ ఇస్తామని చెప్పిన నిధుల బకాయిలను ఈ బడ్జెట్లో కేటాయింపులు చేయాలని కోరారు. 6 గ్యారంటీలకు చట్టబద్ధత తీసుకువస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం దానిని నిలబెట్టుకోవాలని సూచించారు.

**ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొస్తాం**

హామీల అమలుకు నిధులు కేటాయించకుండా ప్రజల తరఫున ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొస్తామని స్పష్టం చేశారు. 2026-27 బడ్జెట్లో 6 గ్యారంటీలు, 420 హామీలు, డిక్లరేషన్ల కింద ఇచ్చిన వాగ్దానాల అమలుకు తగిన నిధులు కేటాయించకపోతే ఎక్కడికి అక్కడ కాంగ్రెస్ ను ప్రజల పక్షాన నిలదీస్తామని హెచ్చరించారు. వృద్ధులు, వితంతువులకు అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పెన్షన్ 4000 పెంచడానికి ఎన్ని నిధులు కావాలో లెక్క గట్టి పైసలు ఈసారి బడ్జెట్లో కేటాయించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

**రైతుల ఖాతాలో నిధులు జమ చేయాలి**

రాష్ట్ర జనాభాలో సగభాగంగా ఉన్న ప్రతి ఒక్క మహిళకు మహాలక్ష్మి కింద నెలకు 2500 అందజేస్తామని హామీ ఇచ్చి 25 నెలలు గడిచిపోయిన ఇప్పటివరకు ఒక లబ్ధిదారుకు ఒక్క పైసా దక్కలేదని మండిపడ్డారు. ఈ బడ్జెట్ కేటాయింపుల్లో గ్యారంటీల అమలుకు అడుగు పడకపోతే ఆడబిడ్డలు ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. రైతుబంధును 15 వేలకు పెంచుతామని మాట ఇచ్చి మోసం చేసినందుకు ముందు క్షమాపణలు చెప్పాలని ఆ మొత్తాన్ని బడ్జెట్లో కేటాయించాలని అన్నదాతల పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే మూడుసార్లు పెండింగ్లో పెట్టిన రైతుబంధు పాత బకాయిలను కూడా చెల్లించాలని, కౌలు రైతులకు రైతు కూలీలకు కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం వారి ఖాతాలో నిధులు జమ చేయాలని కోరారు.

**జాబ్ క్యాలెండర్ నిరుద్యోగ భృతి**

తొలి ఏడాది రెండు లక్షల ఉద్యోగాలు భర్తీతో పాటు జాబ్ క్యాలెండర్ నిరుద్యోగ భృతి వంటి హామీల అమలు కూడా బడ్జెట్లో కేటాయింపులు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి కోల్పోయి రోడ్డుపై పడ్డ ఆటో డ్రైవర్ ఇస్తానన్న ఆర్థిక సహాయం అందజేయడానికి బడ్జెట్లో నిధులు కేటాయించాలని కోరారు. ప్రభుత్వం పనికిరాని అంశాలను తెరపైకి తెచ్చి ప్రతిసారి అటెన్షన్ డైవర్ట్ చేయాలని చేస్తున్న కుట్రలు తెలంగాణ సమాజానికి అర్థమయిపోయాయన్నారు. ఢిల్లీ నేతల సమక్షంలో మేనిఫెస్టోను విడుదల చేయడమే కాకుండా చివరికి ఇంటింటికి గ్యారెంటీ కార్డులను కూడా పంపిణీ చేసి ఇన్నేళ్లపాటు దగా చేయడానికి తెలంగాణ సమాజం సహించదన్నారు. నాటి గ్యారెంటీ కార్డులే ఇవాళ బాకీ కార్డులై ప్రజాక్షేత్రంలో ప్రశ్నిస్తున్నాయన్నారు.

**ప్రతి నెల 4 నిరుద్యోగ భృతి చెల్లిస్తాం**

హైదరాబాద్ యూత్ డెకరేషన్ లో అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న హామీ మాట మార్చి 5 ఏళ్లలో భర్తీ చేస్తామని పేర్కొనడం నిరుద్యోగ యువత గొంతు కోయడమే అన్నారు. నిరుద్యోగులకు ప్రతి నెల 4 నిరుద్యోగ భృతి చెల్లిస్తాం అన్న వాగ్దానాన్ని పూర్తిగా గంగలో కలిపి ఇప్పటి వరకు నయా పైసా కూడా చెల్లించకుండా యువతను మోసగించారన్నారు. కేసీఆర్ హయాంలో నియామక ప్రక్రియ పూర్తి చేసిన వాటికి కాగితాలు ఇచ్చి ఫోటోలకు ఫోజులు ఇవ్వడం తప్ప పట్టుమని పదివేల కొత్త ఉద్యోగాల భర్తకి నోటిఫికేషన్లు ఇవ్వకపోవడం అత్యంత దారుణం అన్నారు. ఈ బడ్జెట్లో మరోసారి ఆరు గారంటీలు 4260 హామీలు డిక్లరేషన్ల కింద ఇచ్చిన వాగ్దానాల అమలుకు తగిన నిధులు కేటాయించకపోతే ఎక్కడికక్కడ నిలదీస్తామని హెచ్చరించారు. తెలంగాణ ప్రజాగ్రహానికి గురై ముఖ్యమంత్రితో పాటు మంత్రులు తిరగలేరని స్పష్టం చేశారు.

# పట్నంలో కమలం.. పల్లెలో గులాబీ

-మొదటిపేజీ తరువాయి

గురువారం ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సహా మంత్రులందరితో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ, పార్టీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి కేసీ వేణుగోపాల్ భేటీ అయ్యారు. ఖర్గే నివాసంలో సుమారు రెండు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో భాగంగా.. ముఖ్యమంత్రి, మంత్రులందరితో కలిపి ఒకసారి, విడివిడిగా మరోసారి చర్చలు జరిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పార్టీల బలాబలాలు, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన ఎన్నికల్లో సాధించిన ఫలితాలతో పాటు ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకా లు, వాటి అమలుకు చేసిన ఖర్చు తదితరాలపై నేతలకు సీఎం రేవంత్ వివరణ ఇచ్చారు. అనంతరం పలు అంశాలపై రాష్ట్ర నేతలకు ఏఐసీసీ పెద్దలు దిశా నిర్దేశం చేశారు.

బలం మరింత పెంచుకునేందుకు ఆ పార్టీలు ప్రయత్నిస్తున్నాయి..

'ఇటీవలి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ మంచి ప్రదర్శన కనబరిచింది. అయితే గ్రామీణ ప్రాంతాల్లో బీఆర్ఎస్, పట్టణ ప్రాంతాల్లో బీజేపీ బలంగా ఉన్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ 29 శాతం ఓట్లు సాధిస్తే, బీజేపీ 16 శాతం ఓట్లు రాబట్టుకుంది. సర్పంచ్ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌కు 30 శాతం సీట్లు వచ్చాయి. బలం మరింత పెంచుకునేందుకు రెండు పార్టీలు గట్టిగా కృషి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో మనం అప్రమత్తంగా ఉండాలి. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసుకుంటేనే ఆ పార్టీలను నిలువరించగలం. దీనికి తోడు కొన్ని సామాజిక వర్గాల్లో ఈ రెండు పార్టీలు పట్టు సాధిస్తున్నాయి. దీనిని అభివృద్ధి మంత్రంతో అడ్డుకోవాలి. యువత, మహిళలను మరింతగా పార్టీకి చేరువ చేయాలి..' అని కాంగ్రెస్ హైకమాండ్ చెప్పినట్లు తెలిసింది.

**ఎంఐఎంపై విస్తృతంగా చర్చిద్దాం**

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను నిలువరించడంతో పాటు ఎంఐఎంను కట్టడి చేసే అంశం రాహుల్‌గాంధీ ప్రస్తావించినట్లు తెలిసింది. ఎంఐఎం ఎంతగా విస్తరిస్తే అంతగా బీజేపీ ఎదుగుతుందని, ఇప్పటికే అనేక ఉత్తరాది రాష్ట్రాల్లో బీజేపీ ఎదుగుదలకు ఎంఐఎం పరోక్షంగా సహకరిస్తోందని వ్యాఖ్యానించినట్టు సమాచారం. ఎంఐఎంను కాంగ్రెస్ భాగస్వామిగా ప్రజలు భావిస్తే గ్రామీణ ప్రాంతాల్లో హిందువుల ఓట్లలో చీలిక వచ్చే అవకాశాలపై అనుమానాలు లేవనెత్తినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. దీనిపై మరోమారు విస్తృతంగా చర్చిద్దామని ఖర్గే అన్నట్టు చెబుతున్నారు.

**బీసీలకు ప్రాధాన్యత ఇచ్చామన్న సీఎం**

ముఖ్యమంత్రి మాట్లాడుతూ..'ఇటీవలి ఎన్నికల్లో సామాజిక న్యాయం పాటించాం. పార్టీ చెబుతున్నట్టుగానే బీసీలకు మున్సిపల్ చైర్మన్, వైఎస్ చైర్మన్ పోస్టుల్లో ప్రాధాన్యతనిచ్చాం. ఇకపైనా ఇదే విధానాన్ని కొనసాగిస్తాం..' అని చెప్పినట్లు తెలిసింది. బీసీ రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర నేతల చిత్తశుద్ధిని ప్రశంసిచిన హైకమాండ్ పెద్దలు.. 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా అడ్డుకున్న బీజేపీ తీరును మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించినట్లు సమాచారం. పార్టీ, ప్రభుత్వం మధ్య మరింత సమన్వయం అవసరమని మీనాక్షి నటరాజన్ సూచించగా, దీనిపై పీసీసీ అధ్యక్షుడు దృష్టి సారించాలని, ప్రభుత్వ కార్యక్రమాల్లో పార్టీ నేతల భాగస్వామ్యం ఉండేలా చూసుకోవాలని చెప్పినట్లు తెలిసింది. కాగా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.. తమతమ శాఖల పరిధిలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ¡రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు చేశామని ఉత్తమ్ చెప్పారు.

**మార్చి 15 నాటికి పదవుల పంపకాలు**

ఎన్నో నెలలుగా పెండింగ్‌లో ఉన్న పార్టీ, నామినేటెడ్ పదవుల భర్తీకి ఈ భేటీలో హైకమాండ్ పెద్దలు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. సామాజిక సమతుల్యతను పాటిస్తూ, అన్ని వర్గాలకు, పార్టీ కోసం పనిచేసిన నిజమైన కార్యకర్తలకు పదవులు ఇవ్వాలని సూచించారు. మార్చి 15 నాటికి రాష్ట్ర స్థాయి పదవుల కేటాయింపు పూర్తిచేసి, ఆ తర్వాత మరో పది రోజుల్లో జిల్లా స్థాయి పదవులను భర్తీ చేయాల్సిందిగా ఆదేశించారు. ఈ పదవుల్లో బీసీలకు పెద్దపీట వేయాలని సూచించినట్లు తెలిసింది. వీటితో పాటు చీఫ్ విప్, రెండు విప్ పదవుల భర్తీపైనా చర్చ జరిగిందని సమాచారం. రెడ్డి లేదా వెలమ సామాజికవర్గ నేతకు చీఫ్ విప్ పదవి ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. మరోవైపు పార్టీ కార్యవర్గ కూర్పుపైనా చర్చించారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌లలో బీసీలు మినహా మిగతా అన్ని సామాజిక వర్గ నేతలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిసింది.

పిలిస్తే మేడారం వచ్చే వాళ్లం కదా..

సమ్మక్క, సారలమ్మ జాతరను ఘనంగా నిర్వహించినందుకు మంత్రి సీతక్కను అగ్రనేతలు అభినందించారు. మేడారం జాతర చరిత్ర, ప్రాశస్త్యం గురించి మంత్రి వివరించగా..ఖర్గే, రాహుల్‌లు మరింత సమాచారం అడిగి తెలుసుకున్నారు. సమ్మక్క, సారలమ్మల చరిత్రను దేశవ్యాప్తంగా పరిచయం చేసేలా జాతీయ స్థాయి సినిమా రూపొందించాలని రాహుల్ సూచించినట్లు సమాచారం. మేడారం జాతరకు ఆహ్వానిస్తే తప్పకుండా హాజరయ్యేవారమని రాహుల్, ఖర్గే అనగా..సమయాభావంతో వ్యక్తిగతంగా ఆహ్వానించలేకపోయినట్లు సీతక్క వివరణ ఇచ్చారు. ఈసారి తప్పకుండా అధికారిక ఆహ్వ?వనం అందజేస్తామని చెప్పారు. ఆహ్వానం అందితే తప్పక వస్తామని రాహుల్, ఖర్గే అన్నారు. కాగా అందరితో కలిసి చర్చించిన పార్టీ అగ్రనేతలు, అనంతరం మంత్రుల కోరిక మేరకు విడివిడిగా ఒక్కో నేతతో 5--10 నిమిషాల పాటు మాట్లాడారు. సీఎం, డిప్యూటీ సీఎం, పీసీసీ అధ్యక్షుడు, మీనాక్షి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సురేఖ పలు అంశాలపై వారితో చర్చించినట్లు తెలిసింది.

## ఉచిత ప్రయాణం కోసం త్వరలో మహిళలకు స్మార్ట్‌కార్డులు

-మొదటిపేజీ తరువాయి

మొదట్లో ఈ స్మార్ట్ కార్డులను ఒక జిల్లాలోని మండలంలో పైలట్? ప్రాజెక్టుగా చేస్తామని తెలిపారు. ఇలా ఒక మండల పరిధిలో చేయడం ద్వారా వాటిలో ఏవైనా సాంకేతిక సమస్యలు వస్తే వాటిని పరిష్కరించి, అలాగే ఇంకేమైనా మార్పులు, చేర్పులు చేయాలంటే చేసి, ఈ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్? కార్డులు పంపిణీ చేయనున్నట్లుగా ఆర్టీసీ ఉన్నతాధికారుల సమాచారం. తొలి దశ ప్రాజెక్టుగా దాదాపు 5 లక్షల మందికి స్మార్ట్? కార్డులు ఇవ్వనున్నట్లు సమాచారం. దీని తయారీకి సుమారుగా రూ.75 కోట్లు వ్యయం అవుతుందని అంచనా. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక సహాయం రూపంలో ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది.

**కార్డుతో ప్రయోజనాలివీ :**

ప్రతి మహిళకు ఈ స్మార్ట్‌కార్డులతో పలు ప్రయోజనాలున్నాయి. మరి అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం.

అర్హత లేని ప్రయాణికుల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు అవకాశం

రూట్, దూర ప్రయాణాలకు, సమయాలపై కచ్చితమైన సమాచారం

పేపర్ లెస్ టికెట్ ప్రయాణం. దీనివల్ల కండక్టర్లపై పనిభారం తగ్గనుంది.

జిల్లా, మండలం, గ్రామం, జోన్ వారి వినియోగ సమాచారం లభ్యమవుతుంది.

రద్దీగా ఉన్న రూట్ల వివరాలు తెలుస్తాయి. బస్సులు పెంచడం, తగ్గించడం ఆర్టీసీకి తేలికవుతుంది.

అలాగే ఈ ఉచిత బస్సు పథకాన్ని ఎంతమంది ఉపయోగించుకున్నారో తెలుస్తుంది.

స్మార్ట్‌కార్డ్‌లో 6 అంకెల యూఐడీ నంబర్ : ఈ స్మార్ట్‌కార్డు జారీలో ప్రతి ప్రయాణికురాలికి 16 అంకెల యూఐడీ నంబర్ ఇస్తారు. ఆ కార్డు ముందు సైడ్ ఎడమ వైపు లబ్ధిదారు పేరు, గ్రామం, మండలం, జిల్లా తదితర వివరాలు ఉంటాయి. కుడివైపు ఫొటో ఉంటుంది. వెనక భాగంలో ఉచిత బస్సు పథకానికి సంబంధించిన నియమ నిబంధనలు పొందుపరిచారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.5 కోట్ల మందికి ఈ స్మార్ట్?కార్డులు జారీ అవనున్నాయి. రెండు నెలల క్రితం తొలి దశలో 5 లక్షల స్మార్ట్ కార్డులతో పైలట్? ప్రాజెక్టు చేపడతామని ఆర్టీసీ తెలిపింది. వీరి ఫలితాల ఆధారంగా ఉచిత ప్రయాణికులను గుర్తించనున్నట్లు ఆ సంస్థ స్పష్టం చేసింది. దీనివల్ల పౌర సరఫరాల శాఖ నుంచి పొందిన సమాచారాన్ని సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్‌తో సమన్వయం చేసి, వ్యాలిడేట్ డేటా ఇస్తుందని ఆర్టీసీ ప్రభుత్వానికి నివేదించింది.

**పెరిగిన ఓఆర్ శాతం**

మహాలక్ష్మి పథకం అమలు చేయడంతో సగటు ఓఆర్ ఏకంగా 95 శాతానికి పెరిగింది. మహిళలకు తెలంగాణ ఆర్టీసీ ప్రస్తుతం జీరో టికెట్ల జారీతో పాటు బస్ టికెట్ల ఛార్జీల్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రీయింబర్స్ చేస్తోంది. నెలకు రూ.358.79 కోట్ల చొప్పున బడ్జెట్‌లో మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణానికి 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.4,305.49 కోట్లు కేటాయించారు.

# జీవన్ రెడ్డి ఔట్...

**కరీంనగర్ :** తానిపత్తి జీవన్‌రెడ్డి.. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి. మాజీ ఎమ్మెల్సీ. మూడేళ్ల క్రితం వరకు జీవన్‌రెడ్డికి పార్టీలో ప్రముఖ స్థానం ఉండేది. 2018 సమయంలో ఏకంగా పీసీసీ పదవికి పోటీ పడ్డారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్‌కు ఛాలెంజ్ చేసి మంత్రి పదవి వదులుకుని ఎంపీగా పోటీ చేశారు. ఇలా అధిష్టానం ఏం చెబితే అది చేస్తూ విధేయుడిగా కొనసాగారు. కానీ, మూడేళ్లుగా పరిస్థితులు మారిపోయాయి. 2023 ఎన్నికల్లో ఓడిపోయాక పార్టీ ఆయనను క్రమంగా దూరం పెడుతోంది. ఎమ్మెల్సీ పదీకాలం ముగుస్తున్న సమయంలో మరోసారి అవకాశం ఇస్తుందని భావించారు. కానీ ఆ ఛాన్స్ కూడా ఇవ్వలేదు.ఇక 2023 అసెంబ్లీ ఎన్నికల్లో జీవన్‌రెడ్డి గెలిచి ఉంటే మంత్రి అయ్యేవారు. కానీ, ఆయన బీఆర్ఎస్ తరఫున పోటీచేసిన సిట్టింగ్ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ చేతిలో ఓడిపోయారు. దీంతో జీవన్‌రెడ్డి ప్రాధాన్యం పార్టీలోనూ తగ్గిపోయింది. ఒకవైపు ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లింది. ఇక ఇదే సమయంలో బీఆర్ఎస్ నుంచి గెలిచిన సంజయ్‌కుమార్ ఏడాది తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. టీపీసీసీ కూడా అన్ని విషయాల్లో సంజయ్‌కుమార్‌కు ప్రాధాన్యం ఇస్తోంది. దీంతో జీవన్‌రెడ్డిలో అసంతృప్తి పెరిగింది. ఒకే ఒరలో రెండు కత్తులు ఇమడలేవని, ఒకే పార్టీలో ఇద్దరు ఇన్‌చార్జీలు ఉండలేరని జీవన్‌రెడ్డి అధిష్టానానికి సంకేతం ఇస్తూ వస్తున్నారు. గతంలో కూడా పార్టీ నిర్ణయాలపై ఆయన బహిరంగంగా విమర్శలు గుప్పించారు.ఏడాదికాలంగా జీవన్‌రెడ్డికి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ వర్గానికి మధ్య అంతర్గత కుమ్ములాట జరుగుతోంది. పంచాయతీ ఎన్నికల సమయంలో పార్టీ గుర్తు ఎన్నికలు కాకపోవడంతోపెద్దగా ప్రభావం చూపలేదు. కానీ, మున్సిపల్ ఎన్నికల వచ్చే సరికి ఇరు వర్గాల మధ్య కౌన్సిలర్ అభ్యర్థుల ఎంపిక విషయంలో సమస్యలు తలెత్తాయి. సంజయ్‌వర్గం అభ్యర్థులకు పార్టీ బీఫాంలు అదించింది. దీంతో జీవన్‌రెడ్డి కతల చెందారు. దీంతో తన వర్గం అభ్యర్థులను స్వతంత్రులుగా బరిలో దించారు. ఫలితాల్లో జీవన్‌రెడ్డి వర్గం 14 మంది గెలవగా, సంజయ్ వర్గం నుంచి 20 మంది గెలిచారు. దీంతో రెండు వర్గాలు కలిస్తే కానీ, పీఠం దక్కే అవకాశం లేకుండా పోయింది.

## మే మొదటి వారంలో కొత్త పార్టీని ప్రకటిస్తాం

-మొదటిపేజీ తరువాయి

సిద్ధిపేట.. రెండో ఛాయిస్ బోధన్ అని కవిత చెప్పారు.ఆర్టీసి కార్మికుల సమ్మె విషయంలో బీఆర్ఎస్ పట్టించుకోలేదనే కోపం కార్మికుల్లో ఉంది. బిల్లుల చెల్లింపు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కంటే బీఆర్ఎస్ ప్రభుత్వం నయం. రెండేళ్లలో ఆర్టీసీలో సింగిల్ పర్మినెంట్ రిక్రూట్మెంట్ లేదని కవిత అన్నారు. ఫ్యూచర్‌లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ఉండదని కవిత సంచలన కామెంట్స్ చేశారు. ప్రధాన ప్రతిపక్షం మేమే అవుతాం.. చూస్తూ ఉండండి అంటూ కవిత అన్నారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి మేమే వస్తామని, ప్రయారిటీల ఆధారంగా మేము సమస్యలపై పోరాటం చేస్తున్నామని కవిత చెప్పుకొచ్చారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తామని, జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ పోటీ చేస్తామని కవిత స్పష్టం చేశారు. మా పార్టీ నేతలు మున్సిపాలిటీల్లో గెలిచిన తరువాత వాళ్లకు ఫోన్లు చేసి ఒత్తిడి తెచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ దారిలోనే వెళ్తుంది. కొత్త తరహా రాజకీయం కాంగ్రెస్ చేయడం లేదని కవిత అన్నారు. నేను పెట్టబోయే పార్టీ వ్యక్తుల మీద నడవదు.. వ్యవస్థల మీద నడవాలి. ప్రాంతీయ పార్టీ లీడర్ సెంట్రిక్ ఉంటుంది. కానీ, వ్యవస్థ నిర్మాణం జరగాలి. సైద్ధాంతిక పునాది ఉండాలని.. ఆ మేరకు పార్టీ నిర్మాణం ఉంటుందని కవిత చెప్పారు. ఆడవాళ్లు అని అవమానించొద్దు. షర్మిల ఈరోజు ఏపీలో ఒక జాతీయ పార్టీకి అధ్యక్షురాలిగా ఉన్నారు. షర్మిల తెలంగాణలో పార్టీ పెట్టడం ఇక్కడ ప్రజలకు నచ్చలేదు. చిరంజీవి పార్టీ పెట్టి మూసివేయలేదా..? నా లైన్లో నేను వెళ్తున్నా.. నా ప్రయత్నం నాది. తెలంగాణ వాదమే మా పార్టీ మొదటి లైన్ అని కవిత స్పష్టం చేశారు. ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడు కింది స్థాయి నుంచి వచ్చిన వాళ్లు కేంద్ర మంత్రులు అయ్యారు. కొత్త తరానికి పెట్టబోయే పార్టీలో అవకాశం ఉంటుందని కవిత చెప్పారు.

## కర్రెగుట్టల్లో ఎన్‌కౌంటర్..

-మొదటిపేజీ తరువాయి

వివరాలను అధికారవర్గాలు ఇంకా వెల్లడించాల్సి ఉంది. 'నక్సల్స్ మిషన్-2026'లో భాగంగా సీఆర్పీఎఫ్, ఛత్తీస్‌గఢ్ పోలీసులు రెండు రోజుల క్రితం 'కేజీహెచ్-2' ఆపరేషన్‌ను ప్రారంభించాయి. కర్రెగుట్టల పరిసరాల్లో 2 వేల మందితో కూడిన బలగాలు వేట కొనసాగిస్తున్నాయి. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి దేవ్‌జీ, జూనియర్ క్యాడర్‌కు చెందిన బెటాలియన్ ఇన్‌ఛార్జి కేసా సోధిని లక్ష్యంగా చేసుకుని ఈ ఆపరేషన్ చేపట్టినట్లు సమాచారం. దేశం నుంచి వామపక్ష తీవ్రవాదాన్ని 2026 మార్చి 31 నాటికి పూర్తిగా నిర్మూలించాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఆ దిశగా 2024లోనే భారీ స్థాయి ఆపరేషన్‌లను ప్రారంభించింది. గత ఏడాది ఏప్రిల్‌లో సీఆర్పీఎఫ్, కోబ్రా, డీఆర్జీ, సీఏఎఫ్ సంయుక్త బలగాలు 21 రోజుల పాటు కర్రెగుట్టల్లో ఆపరేషన్ నిర్వహించాయి. ఆ సమయంలో 31 మంది మావోయిస్టులు మృతి చెందారు. అయితే పార్టీ సీనియర్ క్యాడర్ అక్కడి నుంచి తప్పించుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం తడపల, పామునూరు, మురుమూరు, డోలీ ప్రాంతాల్లో ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్‌లను ఏర్పాటు చేసి సీఆర్పీఎఫ్ బలగాలు నిరంతరం గాలింపు చర్యలు చేపడుతున్నాయి. తాజాగా ప్రారంభమైన 'కేజీహెచ్-2'ను కూడా అత్యంత వ్యూహాత్మక చర్యగా భావిస్తున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో భద్రతా బలగాల ఆపరేషన్ కొనసాగుతోంది. మృతుల్లో మావోయిస్టు అగ్రనేతలు ఉన్నట్లుగా తెలుస్తోంది. పరిస్థితులపై అధికారిక ప్రకటనలు రావాల్సి ఉంది. ఈ ఎదురుకాల్పుల ఘటనలో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**40 రోజులే గడువు**

ఆపరేషన్ కగార్ డెడ్‌లైన్‌కు ఇంకా 40 రోజులే మిగిలి ఉన్నాయి. దేశ వ్యాప్తంగా మావోయిస్టుల ఏరివేతకు కేంద్రం డెడ్‌లైన్ పెట్టుకుంది. దేశాన్ని మావోయిస్ట్ రహిత దేశంగా మార్చాలని నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా గురువారం ఆపరేషన్-2 కగార్ పేరుతో కర్రెగుట్టలో కేంద్ర, రాష్ట్ర బలగాల కూంబింగ్ నిర్వహించాయి. దాదాపు 5000 మంది బలగాలతో అధికారులు ఆపరేషన్ నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే కర్రెగుట్టలోకి చొచ్చుకుపోయారు. జవాన్ల బలగాలతో రాష్ట్ర బలగాలు కలిపి భారీ ఆపరేషన్ నిర్వహించారు. మావోయిస్టు అగ్రనేతలే టార్గెట్‌గా కొనసాగుతోంది. ఇప్పటికి ఐదుగురు మావోలు హతం కాగా.. మరికొందరు లొంగుబాటుకు సిద్ధమవుతున్నట్లు కనిపిస్తోంది.

## ఈసారి రసవత్తరంగా బడ్జెట్ సమావేశాలు

-మొదటిపేజీ తరువాయి

అసెంబ్లీ వేదికగా గళమెత్తనున్నట్లు తెలుస్తోంది. ప్రతిపక్షాల దాడిని సమర్థవంతంగా ఎదుర్కోవాలనే అంశాలపై కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఈసారి బడ్జెట్ సమావేశాలకు ప్రతిపక్షనేత, మాజీ సీఎం కేసీఆర్? వస్తారా? లేదా అనే ప్రశ్నలు కూడా ఉత్పన్నమవుతున్నాయి. ఒకవేళ కేసీఆర్ బడ్జెట్ సమ్మవేశాలకు హాజరైతే మరింత ఇంట్రెస్టింగ్‌గా ఉండే అవకాశం ఉంది.

**3 లక్షల కోట్లతో గతేడాది బడ్జెట్**

2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.3,04,965 కోట్ల అంచనా వ్యయంతో కాంగ్రెస్ ప్రభుత్వం గతేడాది పూర్తిస్థాయి బడ్జెట్?ను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఆ బడ్జెట్?లో సంక్షేమ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు ఆర్థిక మంత్రి భట్టి తెలిపారు. ఆరు గ్యారంటీలకు సుమారు రూ.56,084 కోట్లను కేటాయించారు. రెవెన్యూ వ్యయం రూ.2,26,982 కోట్లు కాగా, మూలధన వ్యయం రూ.36,504 కోట్లుగా వెల్లడించారు. రాష్ట్రం రుణాలు రూ.5,04,814 కోట్లుగా ఉన్నాయని తెలిపారు. శాసనసభలో బడ్జెట్?పై భట్టి విక్రమార్క 1.43 గంటల పాటు ప్రసంగించిన సంగతి తెలిసిందే.

**మార్పు తెచ్చేలా మా పాలన**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ధ్వంసమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నామని, తాత్కాలిక, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నిరంతరం పనిచేస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. ప్రజలకు నిజాలు చెప్పకపోతే స్వార్థపరులు చెప్పేవే నిజమని అనుకుంటారని, మార్పు తెచ్చేలా బాధ్యతాయుత పాలన అందిస్తామని తెలిపారు.

**కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారెంటీలు ఇవే...**

1. మహాలక్ష్మి పథకం

ప్రతి మహిళలకు నెలకు రూ. 2,500 ఆర్థిక సాయం

రూ. 500 కే గ్యాస్ సిలిండర్

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం.

2. రైతు భరోసా

రైతులకు, కౌలు రైతులకు ఏడాదికి ఎకరాకు రూ. 15,000.

వ్యవసాయ కూలీలకు(కౌలు రైతులు) రూ. 12,000 ఆర్థిక సాయం.

వరి పంటకు రూ. 500 బోనస్.

3. గృహ జ్యోతి

**ప్రతి ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు పంపిణీ.**

4. ఇందిరమ్మ ఇళ్లు

ఇల్లు లేని పేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు. స్థలం ఉండి అర్హులైన వారికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం.

తెలంగాణ ఉద్యమకారులకు 250 చదరపు గజాల స్థలం కేటాయింపు.

5. రాజీవ్ యువవికాసం

విద్యార్థులకు రూ. 5 లక్షల విద్యా భరోసా కార్డు.

ప్రతి మండలంలో ఇంటర్నేషనల్ స్థాయిలో పాఠశాలల ఏర్పాటు.

6. చేయూత

వృద్ధులు, వితంతువులు ఇతరులకు నెలకు రూ. 4,000 ఆసరా పెన్షన్.

రాజీవ్ ఆరోగ్యశ్రీ ఫథకం కింద రూ. 10 లక్షల వరకు ఉచిత బీమా.

## అవినీతి మంత్రుల చిట్టా తమ వద్ద ఉంది

-మొదటిపేజీ తరువాయి

సంపాదించుకుంటూ, మంత్రులకు ఎలా కూడబెడుతున్నారో తమకు తెలుసని అన్నారు. ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు మూటలు పంపించడానికే తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉందని బండి సంజయ్ అన్నారు. ఒక్కో మంత్రి అవినీతి చిట్టా విప్పుతామని హెచ్చరించారు. అవినీతికి సంబంధించి ఆడియో రికార్డులు తమ వద్ద ఉన్నాయని అన్నారు. 2029 నాటికి దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండదని జోస్యం చెప్పారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలకు చెంప చెళ్లుమనిపించామని బండి సంజయ్ అన్నారు.

## సంపాదకీయం

# ఏఐ క్యాపిటల్‌గా భారత్

అమెరికా వాణిజ్య ఆధిపత్యం, చైనా ఒంటెత్తు పోకడలకు భిన్నంగా భారత్ ఒక 'మూడవ మార్గాన్ని' ప్రపంచానికి పరిచయం చేయబోతున్నదని చెప్పవచ్చు. కీలకమైన సంస్థల డేటా సెంటర్లు ఇండియాలో ఏర్పాటు చేస్తుండటంతో అంతర్జాతీ యంగా కూడా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎలా పనిచేయాలి? దాని పరిమితులు పరిధులు కూడా నిర్ణయించే దిశగా అడుగులు వేస్తున్నది. ఈ సదస్సు చివరిరోజున అంటే ఫిబ్రవరి 20వ తేదీన భారత్ 'ఢిల్లీ డిక్లరేషన్' పేరిట ఓ డ్రాఫ్ట్ విడుదల చేయ బోతున్నది. అది భవిష్యత్తులో ఏఐ ఎలా పనిచేయాలన్న విధివిధానాలకు మార్గదర్శకంగా నిలవబోతున్నది. ఇప్పటికే ప్రధాని డీప్ ఫేక్ లాంటి సమస్యలను బహిరంగంగానే లేవనెత్తారు. ఇలాంటి సమస్యలకు పరిష్కారం ఎలా ఉండాలన్నది డిక్లరేషన్‌లో చర్చకు రానున్నది. ఇక ఏఐ కేవలం అభివృద్ధి చెందిన దేశాలకు మాత్రమే పరిమితం కాకు డదని.. ఆఫ్రికా వంటి పేద దేశాలకు కూడా అందేలా చూడాలని పిలుపు ఇవ్వనున్నారు.. మొత్తంగా ఏఐకి భారత్ క్యాపిటల్ అయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అంతిమంగా భారత్ ఇప్పుడు కేవలం ఒక మార్కెట్ మాత్రమే కాదు.. ఏఐ ప్రపంచానికి మార్గదర్శి లేదా దిక్సూచిగా మారబోతోంది. భారత్ ఏఐ హబ్‌గా మారడానికి ఉన్న అవకాశాలు మరే దేశానికీ లేవన్నది వాస్తవం. దీనికి ప్రధానంగా మూడు కారణాలు ఉన్నాయి. డేటా వైవిధ్యం.. భారత్‌లోని భాషలు, సంస్కృతులు, భౌగోళిక పరిస్థితులు ఏఐ అల్గారిథమ్స్ శిక్షణకు అద్భుతమైన ముడిసరుకు.. ఇక్కడ ఒక ఏఐ మోడల్ సక్సెస్ అయిందంటే, అది ప్రపంచవ్యాప్తంగా ఎక్కడైనా పనిచేయగలదని అంతర్జాతీయంగా పేరొందిన టెక్ కంపెనీలు నమ్ముతున్నాయి. అందుకే అమెరికాలోనే ఉచితంగా ఇవ్వని ఏఐ అత్యాధునిక మోడళ్లను ఇక్కడ ఉచితంగా అందజేస్తున్నాయి. ఇక డెమోగ్రాఫిక్ డివిడెండ్.. ప్రపంచంలోనే అతిపెద్ద యువ జనాభాతోపాటు ఇంగ్లీష్ మాట్లాడే సాంకేతిక నిపుణులు భారత్ సొంతం. ఇది అంతర్జాతీయ సంస్థలను అయస్కాంతంలా ఆకర్షిస్తున్నది. దీంతో పాటు ప్రధానమైన మరో అంశం డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్.. యూపీఐ లాంటి వ్యవస్థల ద్వారా సామాన్యుడిని డిజిటల్ పరిధిలోకి తెచ్చిన అనుభవం భారత్‌కు ఉంది. ఇప్పుడు అదే స్ఫూర్తితో 'ఇండియా ఏఐ మిషన్' సాగుతున్నది. కొన్నేళ్ల క్రితమే భారత ప్రభుత్వం ఒక నిబంధన తెచ్చింది. 'భారతీయుల డేటా (ముఖ్యంగా బ్యాంకింగ్, వ్యక్తిగత వివరాలు) భారత గడ్డపై ఉన్న సర్వర్లలోనే ఉండాలి.' దీంతో గతంలో అమెరికా లేదా సింగపూర్‌లో సర్వర్లు పెట్టుకున్న గూగుల్, ఫేస్‌బుక్, అమెజాన్ వంటి సంస్థలు తప్పనిసరిగా భారత్‌లో డేటా సెంటర్లు నిర్మించా ల్సి వచ్చింది. ఇది ఒక ముందస్తు 'మాస్టర్ ప్లాన్'. అందుకోసమే ప్రస్తుత బడ్జెట్‌లో ప్రభుత్వం డేటా సెంటర్ల కోసం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. విదేశీ క్లౌడ్ కంపెనీలు భారత్‌లో డేటా సెంటర్లు పెట్టి ఇక్కడి నుండి ప్రపంచ వ్యాప్తంగా సేవలు అందిస్తే, వారికి 2047 వరకు పన్ను మినహాయింపులు ప్రకటించింది. డేటా సెంటర్లను 'మౌలిక సదుపాయాల' జాబితాలో చేర్చడం వల్ల వీరికి తక్కువ వడ్డీకే రుణాలు దొరుకుతున్నాయి. మైక్రోసాఫ్ట్ సంస్థ హైదరాబాద్, ముంబై, పుణె ప్రాంతాల్లో సుమారు 21.5 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో డేటా సెంటర్లను ఏర్పాటు చేస్తున్నది. విశాఖపట్నంలో గూగుల్ తన మొదటి పూర్తిస్థాయి 'ఏఐ హబ్'ను ఏర్పాటు చేయడానికి 15 బిలియన్ డాలర్లు కేటాయించింది. రిలయన్స్, అదానీ వంటి స్వదేశీ దిగ్గజాలు కూడా గిగావాట్ స్థాయి డేటా సెంటర్లను గుజరాత్, మహారాష్ట్ర తోపాటు ఆంధ్ర ప్రదేశ్‌లో నిర్మిస్తున్నాయి. ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో డేటా సెంటర్ నిర్వహణ ఖర్చు (ముఖ్యంగా లేబర్, కన్స్ట్రక్షన్) చాలా తక్కువ. భారత్ సౌర విద్యుత్ రంగంలో దూసుకుపోతున్నది. డేటా సెంటర్లకు కావలసిన భారీ విద్యుత్తును గ్రీన్ ఎనర్జీ ద్వారా అందించడం వల్ల అంతర్జాతీయ కంపెనీలకు తమ 'కార్బన్ ఫుట్‌ప్రింట్' తగ్గించుకునే అవకాశం దొరుకు తోంది. 'డేటా ఇస్ ద న్యూ ఆయిల్' అని మనందరికీ తెలుసు.. ఆ చమురును నిల్వ చేసే 'ట్యాంకర్లే' ఈ డేటా సెంటర్లు.. భారత్ ఇప్పుడు ప్రపంచానికి డిజిటల్ గిడ్డంగిగా మారబోతున్నది. ఏఐ వల్ల కలిగే లాభాల కంటే, దాని మిస్ యూజ్ గురించిన ఆందోళనలే ఎక్కువ. అందుకే నియమ నిబంధనల విషయంలో భారత్ కఠినంగా వ్యవహరించనున్నది. భారతీయ వినియోగదారుల డేటా భారత గడ్డపైనే ఉండాలి. విదేశీ సంస్థలు మన డేటాను 'టెస్టింగ్ ల్యాబ్'గా వాడుకోవచ్చు కానీ, దానిని మనకు వ్యతిరేకంగా వాడకుండా చూడాలి. జర్నలిజం రంగంలో ఏఐ వల్ల తప్పుడు వార్తలు వ్యాపించే ప్రమాదం ఉంది. దీనిని అరి కట్టేలా ఏఐ కంటెంట్‌కు 'డిజిటల్ వాటర్‌మార్క్' తప్పనిసరి చేసే దిశగా చట్టాలు రాబోతున్నాయి. ముఖ్యంగా బ్యాం కింగ్, వైద్యం వంటి రంగాల్లో ఏఐ వాడకంపై స్పష్టమైన గైడ్‌లైన్స్ అవసరం. అంతేకాకుండా కొన్ని దశాబ్దాల కిందట భారతదేశం మెడికల్ డ్రగ్ ట్రయల్స్‌కు బలైంది.. గతంలో జరిగిన 'డ్రగ్ ట్రయల్స్' చేదు జ్ఞాపకాలను దృష్టిలో ఉంచుకుని, ఇప్పుడు జరుగుతున్న 'డేటా ట్రయల్స్' విషయంలో ప్రభుత్వం మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉన్నది. ప్రజలు సమాచారాన్ని పంచుకోవడానికి సిద్ధం గా ఉన్నప్పటికీ, ఆ సమాచారం వారి వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.. డేటా సెంటర్లు సహా ఇతర వ్యవస్థల ఏర్పాటుకు ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు ఎన్ని రాయితీలు ఇచ్చినా డేటా దుర్వినియోగం కాకుండా కఠినంగా వ్యవహరించాల్సి ఉన్నది.

# తెలంగాణలో కాంగ్రెస్ ముందున్న సవాళ్లు



జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి విషయంలో చోటుచేసుకున్న పరిణామాలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చలకు తెర లేపాయి. తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడం, పార్టీలో కొనసాగడంపై ఆలోచిస్తున్నానని ప్రకటించడం, అదే సమయంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కే.సి. వేణుగోపాల్ ఆయనకు ఫోన్ చేసి ఢిల్లీకి చర్చలకు ఆహ్వానించడం?ఈ పరిణామాలన్నీ రాష్ట్ర కాంగ్రెస్ అంతర్గత సమీకరణాలను, అధికార రాజకీయాల నడతలను, భవిష్యత్ వ్యూహాలను ప్రశ్నార్థకంగా నిలబెట్టాయి. జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి కేవలం స్థానిక సంస్థలోని ఒక హోదా మాత్రమే కాకుండా, ఉత్తర తెలంగాణలో కాంగ్రెస్ ప్రభావం, నాయకత్వ సమన్వయం, కేడర్ మనోభావాల ప్రతిబింబంగా మారింది. జీవన్ రెడ్డి తెలంగాణ రాజకీయాల్లో దశాబ్దాల అనుభవం కలిగిన నేత. ఎమ్మెల్యేగా, మంత్రిగా, శాసనసభలో ప్రతిపక్ష ధ్వనిగా తన ముద్ర వేశారు. కాంగ్రెస్ పార్టీ బలహీన దశల్లో కూడా పార్టీ పట్ల విశ్వాసం కోల్పోకుండా నిలిచిన నాయకుల్లో ఆయన ఒకరు. 2014లో తెలంగాణ ఏర్పాటుకు అనంతరం కాంగ్రెస్ ఎదుర్కొన్న రాజకీయ సంక్షోభాల్లోనూ, 2018లో భారీ పరాజయానంతరం పార్టీ పునర్నిర్మాణం లోనూ ఆయన చురుకైన పాత్ర పోషించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో, పార్టీకి కష్టకాలంలో అండగా నిలిచిన నేతలకు సముచిత గౌరవం లభిస్తుందనే అంచనాలు సహజమే. అయితే జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి విషయంలో ఆయనకు ఎదురైన అనుభవం ఆ అంచనాలను దెబ్బతీసిందనే భావన ఆయన అనుచరుల్లో వ్యక్తమవుతోంది. జగిత్యాల మున్సిపాలిటీలో మొత్తం వార్డుల సంఖ్య, పార్టీల బలం, కౌన్సిలర్ల సమీకరణాలు? ఈ అంశాలు చైర్‌పర్సన్ ఎన్నికలో కీలక పాత్ర పోషించాయి. స్థానికంగా కాంగ్రెస్ కౌన్సిలర్లు మెజారిటీకి చేరువలో ఉన్నా, ప్రత్యక్ష ఎన్నికల తర్వాత రాజకీయ చర్చలు, మైత్రి యత్నాలు, క్రాస్ ఓటింగ్ అనుమానాలు వంటివి వాతావరణాన్ని ఉద్రిక్తం చేశాయి. ఈ సందర్భంలో భాజపా, భారాసా, కాంగ్రెస్ మధ్య స్థానిక స్థాయిలో జరిగిన సంప్రదింపులు కూడా ప్రాధాన్యం సంతరించు కున్నాయి. ముఖ్యంగా భారాసా నుంచి గెలిచి తరువాత సీఎం రేవంత్ రెడ్డిని కలిసి కాంగ్రెస్‌కు అనుకూలంగా పని చేస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు ప్రాధాన్యత జీవన్ రెడ్డి వర్గాన్ని కలవరపరిచాయి. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన నేతను పక్కనపెట్టి, ఇటీవల చేరిన నాయకుడికి అవకాశమిస్తే కేడర్‌లో ఏ సందేశం వెళ్తుందన్న ప్రశ్నలు తెరపైకి వచ్చాయి. ఇక్కడ ఒక కీలక అంశం రాజకీయ పునర్వ్యవస్థీకరణ. అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలు విస్తరణ వ్యూహాన్ని అనుసరించడం సహజం. ఇతర పార్టీల నుంచి నాయకులను ఆకర్షించడం, స్థానిక బలాలను సమీకరించడం, ఎన్నికల లాభనష్టాలను దృష్టిలో పెట్టుకోవడం? ఇవి అధికార రాజకీయాల భాగం. అయితే ఈ ప్రక్రియలో పాత కేడర్ మనోభావాలు దెబ్బతినకుండా చూడటం కూడా సమానంగా అవసరం. జీవన్ రెడ్డి అసంతృప్తి ఈ సమతౌల్యం లోపించిందనే సంకేతాన్ని ఇస్తోంది. జీవన్ రెడ్డి "పార్టీలో కొనసాగడంపై ఆలోచిస్తున్నాను" అని చెప్పడం కేవలం భావోద్వేగ వ్యాఖ్య కాదు; అది ఒక రాజకీయ హెచ్చరికగా కూడా చూడవచ్చు. తెలంగాణ రాజకీయాల్లో పార్టీ మార్పులు కొత్త విషయం కావు. గత దశాబ్దంలో అనేక మంది నేతలు తమ రాజకీయ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పార్టీలను మార్చారు. అధికార పార్టీ వైపు ఆకర్షణ సహజమైతే, అసంతృప్తి కారణంగా ప్రతిపక్ష వైపు మొగ్గు చూపడం కూడా జరిగిందే. ఈ నేపథ్యంలో జీవన్ రెడ్డి నిర్ణయం కాంగ్రెస్‌కు ప్రతిష్టాత్మక అంశంగా మారింది. అయితే అదే సమయంలో ఢిల్లీ నుంచి వచ్చిన స్పందన పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. కే.సి. వేణుగోపాల్ ఫోన్ చేసి ఢిల్లీకి ఆహ్వానించడం ద్వారా కేంద్ర నాయకత్వం ఈ అంశాన్ని చిన్నదిగా తీసుకోవడం లేదని స్పష్టమైంది. ఇది రెండు సందేశాలను ఇస్తోంది. మొదటిది?జీవన్ రెడ్డి పార్టీకి విలువైన నాయకుడు అన్న గుర్తింపు. రెండవది?రాష్ట్ర స్థాయి సమన్వయంలో లోపాలున్నాయన్న అవగాహన. ఢిల్లీలో జరిగే చర్చలు కేవలం జగిత్యాల అంశానికే పరిమితం కాకుండా, తెలంగాణ కాంగ్రెస్‌లో నాయకత్వ సమీకరణాలు, అధికార పంపిణీ, భవిష్యత్ ఎన్నికల వ్యూహాలపై దృష్టి సారించే అవకాశముంది. సిట్టింగ్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు లభించిన ప్రాధాన్యం కూడా రాజకీయంగా పరిశీలించ దగిన అంశం. భారాసా నుంచి గెలిచి, తరువాత సీఎం రేవంత్ రెడ్డిని కలిసి కాంగ్రెస్‌కు అనుకూలంగా పనిచేస్తున్న నాయకుడికి అవకాశమివ్వడం ద్వారా ప్రభుత్వం స్థానిక స్థాయిలో తన ప్రభావాన్ని బలోపేతం చేయాలని భావించిందనే వాదన ఉంది. రాజకీయాల్లో స్నేహ శత్రుత్వాలు శాశ్వతం కావు; ప్రయోజనాలు శాశ్వతం. ఈ దృష్టిలో చూస్తే, సంజయ్ కుమార్‌ను సమీకరించడం ఒక వ్యూహాత్మక నిర్ణయంగా కనిపించవచ్చు. కానీ అదే సమయంలో జీవన్ రెడ్డి వంటి సీనియర్ నేతకు గౌరవం ఇవ్వకపోతే దీర్ఘకాలిక అసంతృప్తి ఏర్పడే ప్రమాదం ఉంది. తెలంగాణ కాంగ్రెస్ ప్రస్తుతం అధికారంలో ఉన్నప్పటికీ అంతర్గత సమన్వయం కీలకం. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ సాధించిన విజయానికి అనేక మంది సీనియర్ నాయకుల కృషి కారణమైంది. జిల్లాల వారీగా బలమైన నాయకత్వం లేకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభావం తగ్గే అవకాశం ఉంటుంది. జగిత్యాల వంటి ప్రాంతాల్లో జీవన్ రెడ్డి ప్రభావం గణనీయమని స్థానిక రాజకీయ వర్గాలు అంగీకరిస్తున్నాయి. ఆయన అనుచరుల సంఖ్య, కేడర్‌పై పట్టుదల, సామాజిక వర్గాల మద్దతు? ఇవి పార్టీకి ఆస్తులే. జీవన్ రెడ్డి పార్టీ మారతారా? కాంగ్రెస్ లోనే కొనసాగుతారా? అన్న ప్రశ్నలకు తక్షణ సమాధానం ఇవ్వడం కష్టం. రాజకీయంగా చూస్తే ఆయనకు మూడు మార్గాలు ఉన్నాయి. మొదటిది?పార్టీలోనే కొనసాగుతూ తన అసంతృప్తిని చర్చల ద్వారా పరిష్కరించుకోవడం. రెండవది?సక్రియ రాజకీయాల నుంచి కొంత దూరంగా ఉండడం. మూడవది?ఇతర పార్టీ ఆహ్వానం స్వీకరించడం. అయితే గత అనుభవాలను పరిశీలిస్తే జీవన్ రెడ్డి కాంగ్రెస్ సిద్ధాంతాలకు దగ్గరగా ఉన్న నాయకుడిగా గుర్తింపు పొందారు. కాబట్టి వెంటనే పార్టీ మార్పు జరిగే అవకాశాలు తక్కువగానే కనిపిస్తున్నాయి. ఢిల్లీ చర్చల ఫలితమే దీనిపై స్పష్టతనిస్తుంది. ఈ పరిణామం మరో కోణాన్ని కూడా వెలుగులోకి తీసుకొస్తోంది?అధికార రాజకీయాల్లో గుర్తింపు, గౌరవం, భాగస్వామ్యం అన్న మూడు అంశాలు సమానంగా ఉండాలి. కేవలం పదవులు పంచడమే కాకుండా, నిర్ణయ ప్రక్రియలో సీనియర్ నేతలకు స్థానం కల్పించాలి. లేకపోతే అసంతృప్తి బయట పడటమే కాకుండా, కేడర్‌లో నిస్సహాయత పెరిగే ప్రమాదం ఉంది. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికలు, పరిషత్ పోటీలు, భవిష్యత్ లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా కాంగ్రెస్‌కు ఏకత అవసరం.జగిత్యాల చైర్‌పర్సన్ వివాదం తాత్కాలికమేనా, లేక దీర్ఘకాలిక ప్రభావం చూపే పరిణామమా అన్నది రాబోయే రోజుల్లో తేలుతుంది. అయితే ఒక విషయం స్పష్టం?జీవన్ రెడ్డి వంటి నాయకుల మనోభావాలను పట్టించుకోకుండా తెలంగాణ కాంగ్రెస్ ముందుకు సాగడం సులభం కాదు. కేంద్ర నాయకత్వం జోక్యం చేసుకోవడం సానుకూల సంకేతమే. ఇది పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యానికి నిదర్శనంగా కూడా చూడవచ్చు. చివరికి, ఈ సంఘటన కాంగ్రెస్‌కు ఒక పాఠం. అధికారంలోకి వచ్చిన తర్వాత విస్తరణ వ్యూహం అవసరమే అయినా, పాత సైనికులను మరచిపోవడం ప్రమాదకరం. జీవన్ రెడ్డి నిర్ణయం ఏదైనా కావచ్చు; కానీ ఈ సంక్షోభం తెలంగాణ రాజకీయాల్లో సమన్వయ రాజకీయాల ప్రాముఖ్యతను మరోసారి గుర్తు చేసింది. ఢిల్లీ చర్చల అనంతరం పరిణామాలు ఎలా మలుపు తిరుగుతాయో అన్న ఆసక్తి రాష్ట్ర రాజకీయ వర్గాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. కాంగ్రెస్ లో కొనసాగుతూ గౌరవప్రద పరిష్కారం సాధిస్తారా, లేక కొత్త రాజకీయ అధ్యాయం ప్రారంభిస్తారా? ఈ ప్రశ్నకు సమాధానం సమీప భవిష్యత్తులో వెలువడనుంది.

# స్థానిక విజయాల ఊపు

# పరిషత్ ఎన్నికలపై ప్రభుత్వ చూపు



ప్రజా పరిషత్ ఎన్నికల నిర్వహణ గురించి, ప్రభుత్వ యోచన అనే చర్చ ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త ఊపును సంత రించుకుంది. గ్రామీణ స్వపరిపాలన వ్యవస్థలో కీలక స్థానం కలిగిన ప్రజా పరిషత్‌లు కేవలం పరిపాలనా యంత్రాంగం మాత్రమే కాదు; అవి గ్రామీణ ప్రజాస్వామ్యానికి ప్రాణాధారం. ఇటీవలి గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఇప్పుడు పరిషత్ ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం ఆలోచనలో ఉందన్న సంకేతాలు రాజకీయ వర్గాల్లో విశేష చర్చకు దారితీస్తున్నాయి. ఈ పరిణామం వెనుక ఉన్న రాజకీయ, పరిపాలనా, సామాజిక కోణాలను సమగ్రంగా పరిశీలిస్తే ఒక స్పష్టమైన దిశ కనిపిస్తుంది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల పాలనలో ఏర్పడిన అంతరాలు ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి. పదవీకాలం ముగిసిన తర్వాత ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న పరిపాలన తాత్కాలిక పరిష్కారమే గానీ, ప్రజా ప్రతినిధుల ద్వారా నేరుగా జరిగే పాలనకు ఇది ప్రత్యామ్నాయం కాలేదు. గ్రామీణ స్థాయిలో అభివృద్ధి పనుల ప్రాధాన్యత, స్థానిక అవసరాలపై స్పందన, ప్రజలతో ప్రత్యక్ష సంబంధం ? ఇవన్నీ ఎన్నికైన ప్రతినిధుల ద్వారానే సమర్థవంతంగా సాధ్యమవుతాయి. అందుకే పరిషత్ ఎన్నికల నిర్వహణపై ఆసక్తి పెరుగుతోంది. ఇటీవలి గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీగా ఉన్న భారత జాతీయ కాంగ్రెస్ అత్యధిక స్థానాలను దక్కించుకోవడం రాజకీయంగా కీలక మలుపుగా భావించ బడుతోంది. ఈ విజయాలు గ్రామీణ, పట్టణ స్థాయిల్లో అధికార పక్షానికి బలమైన మద్దతు ఉందన్న సంకేతాలను ఇస్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. అదే ఊపును కొనసాగిస్తూ పరిషత్ ఎన్నికలను త్వరగా నిర్వహిస్తే రాజకీయ లాభం చేకూరుతుందన్న ఆలోచన ప్రభుత్వ వర్గాల్లో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఎన్నికల సమయం నిర్ణయించడంలో ఈ రాజకీయ లెక్కలు కూడా కీలక పాత్ర పోషిస్తాయి. పరిషత్ ఎన్నికలు నిర్వహించడం పరిపాలనా పరంగా చిన్న విషయం కాదు. ఓటరు జాబితాల సవరణ, రిజర్వేషన్ల అమలు, భౌగోళిక పునర్విభజన, చట్టపరమైన అనుసరణ ? ఇవన్నీ సమన్వయంతో జరగాలి. ఈ మొత్తం ప్రక్రియను పర్యవేక్షించే బాధ్యత తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘంపై ఉంటుంది. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, నిష్పాక్షికత, చట్టబద్ధత కీలకం. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలవడం ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభం. రాజకీయ కోణంలో చూస్తే పరిషత్ ఎన్నికలు సాధారణ స్థానిక పోటీగా మిగలడం లేదు. ఇవి రాష్ట్ర రాజకీయాల దిశను సూచించే సూచికలుగా మారుతున్నాయి. గ్రామీణ ఓటరు తీర్పు సాధారణంగా అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, స్థానిక నాయకత్వంపై ఆధారపడి ఉంటుంది. గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల ఫలితాలు అధికార పక్షానికి అనుకూలంగా రావడం వల్ల అదే ధోరణి పరిషత్ ఎన్నికల్లోనూ కొనసాగుతుందన్న అంచనాలు ఉన్నాయి. అయితే ఎన్నికల రాజకీయాల్లో స్థానిక అంశాల ప్రాధాన్యం ఎక్కువగా ఉండటం వల్ల ప్రతి ప్రాంతంలో సమీకరణాలు వేరుగా ఉండే అవకాశం కూడా ఉంది. సామాజిక దృష్టితో పరిశీలిస్తే పరిషత్ ఎన్నికలు గ్రామీణ ప్రజాస్వామ్యాన్ని చైతన్యవంతం చేసే ప్రక్రియ. మహిళల రిజర్వేషన్లు, వెనుకబడిన వర్గాల ప్రాతినిధ్యం, యువ నాయకత్వానికి అవకాశాలు ? ఇవన్నీ స్థానిక పాలనను సమగ్రంగా మారుస్తాయి. ఎన్నికలు జరిగితే గ్రామస్థాయి నాయకత్వం పునరుద్ధరించ బడుతుంది. ప్రజల సమస్యలు నేరుగా ప్రతినిధుల దృష్టికి చేరుతాయి. పరిపాలనలో ప్రజల భాగస్వామ్యం పెరుగుతుంది. ఆర్థిక పరంగా ప్రజా పరిషత్‌ల ప్రాముఖ్యత మరింత స్పష్టంగా కనిపిస్తుంది. గ్రామీణ మౌలిక వసతులు ? రహదారులు, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, పాఠశాల సదుపాయాలు ? ఇవన్నీ స్థానిక సంస్థల ద్వారానే అమలవుతాయి. ఎన్నికలు ఆలస్యం అయితే అభివృద్ధి కార్యక్రమాల్లో నిరంతరత దెబ్బతింటుంది. ప్రజాప్రతినిధులు లేకపోవడం వల్ల స్థానిక అవసరాలు ఉన్నతస్థాయికి చేరే ప్రక్రియ మందగిస్తుంది. అందువల్ల పరిషత్ ఎన్నికలు నిర్వహించడం గ్రామీణ అభివృద్ధికి వేగం అందించే చర్యగా భావించ బడుతోంది. రాజకీయ వ్యూహాల పరంగా అన్ని పార్టీలు గ్రామీణ స్థాయిలో తమ బలగాలను పునర్వ్యవస్థీకరిస్తున్నాయి. అధికార పక్షం ఇటీవల వచ్చిన విజయాల ఊపును కొనసాగించాలని చూస్తే, ప్రతిపక్షాలు తమ లోపాలను సరిదిద్దుకొని కొత్త వ్యూహాలతో ముందుకు రావాలని ప్రయత్నిస్తున్నాయి. అభివృద్ధి, సంక్షేమం, స్థానిక సమస్యల పరిష్కారం ? ఇవే ప్రధాన ప్రచార అజెండాలుగా మారే అవకాశం ఉంది. ప్రభుత్వ దృష్టిలో ఎన్నికల సమయం నిర్ణయం సున్నితమైన అంశం. పరిపాలనా సిద్ధత, న్యాయపరమైన అంశాలు, రాజకీయ సమీకరణాలు ? ఇవన్నీ సమతుల్యంగా ఉండాలి. త్వరితగతిన ఎన్నికలు నిర్వహిస్తే ప్రజాస్వామ్య పునరుద్ధరణకు దోహదం అవుతుంది. అదే సమయంలో అన్ని ప్రక్రియలు చట్టబద్ధంగా, పారదర్శకంగా పూర్తి కావడం కూడా అవసరం. ప్రజల నమ్మకం నిలబెట్టుకోవడం ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమైన అంశం. చివరగా చూస్తే ప్రజా పరిషత్ ఎన్నికలు గ్రామీణ ప్రజాస్వామ్య బలాన్ని ప్రతిబింబించే కీలక ప్రక్రియ. ఇటీవలి స్థానిక ఎన్నికల ఫలితాలు, ప్రభుత్వ యోచనలు, పరిపాలనా సన్నాహాలు ? ఇవన్నీ కలిసి ఒక కీలక రాజకీయ దశను సూచిస్తున్నాయి. గ్రామీణ ప్రజల ఆశలు, అవసరాలు, అభివృద్ధి లక్ష్యాలు ఈ ఎన్నికల ద్వారా స్పష్టమైన దిశను పొందగలవు. ప్రజాస్వామ్య వ్యవస్థ పునాది గ్రామంలోనే బలపడితేనే రాష్ట్ర పరిపాలన సమగ్రంగా ముందుకు సాగుతుంది. పరిషత్ ఎన్నికలు ఆ దిశగా ఒక ముఖ్యమైన అడుగుగా నిలిచే అవకాశముంది.

ప్రతిఘటన
తెలుగు దిన పత్రిక
శుక్రవారం 20 ఫిబ్రవరి 2026

## శ్రీశ్రీశ్రీ ఆదిత్య పరా శ్రీ స్వామి చేతుల మీదుగా

# చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహిష్కరణ

**నేను ఏ కురాన్ కు,ఏ బైబిల్ కు వ్యతిరేకం కాదు, హిందూ ధర్మాన్ని వ్యతిరేకిస్తున్న వారిపైనే నా విమర్శ...**

**విగ్రవిస్కరణలో శ్రీ శ్రీ శ్రీ ఆదిత్యపరశ్రీ స్వామి**

ప్రతిఘటన,నాగర్ కర్నూల్



జిల్లాలోని బిజినపల్లి మండలంలో గల గుడ్లనర్వ గ్రామంలో చత్రపతి శివాజీ మహారాజ్ 396వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిపారు. ఈ జన్మదినం సందర్భంగా శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి అంబాత్రేయ క్షేత్ర పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ ఆదిత్య పరాశ్రీ స్వామివారి చేతుల మీదుగా గురువారం గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఆవిష్కరించారు. ముందుగా ఊరి బయట స్వామివారికి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు,అక్కడ నుండి బ్యాండ్ మేళాలతో ర్యాలీగా తీసుకువెళ్లి భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్ గారికి, మహాత్మ జ్యోతిరావు పూలే గారి విగ్రహాలకు స్వామివారి చేతుల మీదుగా పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి స్వామివారి మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని కాపాడాలి,ముస్లిం సోదరుల పండుగలకు వ్యతిరేకంగా,హిందూ సంప్రదాయం ప్రకారం ప్రజలు కట్టు,బొట్టు కాషాయం ధరించాలన్నారు. హిందూ మత వ్యతిరేకులను తరిమికొట్టాలన్నారు. కందూర్లు,పీర్ల పండుగలను పూర్తిగా వ్యతిరేకించాలన్నారు. పహల్గాం,కార్గిల్ యుద్ధాలు ఎవరు సృష్టించారో గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కుల మతాలకు అతీతంగా హిందువులంతా కలిసి మెలిసి ఉండాలన్నారు. హిందూ ముస్లిం మధ్యన వ్యత్యాసాన్ని తెలియజేస్తూ కులరహిత సమాజం కావాలన్నారు. కులమతాలకు అతీతంగా పెళ్లిళ్లు జరగాలన్నారు. నేను ఏ కురాన్ కు,ఏ బైబిల్ కు వ్యతిరేకంగా మాట్లాడను,మతాల్లో చిచ్చు రేపుతున్న వ్యక్తుల గురించి మాత్రమే మాట్లాడుతాను అన్నారు. శివాజీ విగ్రహాన్ని నెలకొల్పడం గొప్ప కాదు, అతని ఆశయాలను ధర్మాన్ని అనుసరించడం గొప్ప సంకల్పం అన్నారు. నేను మీ గ్రామానికి రావడం మీ అందరూ అదృష్టంగా భావిస్తున్ననన్నారు. మిమ్మల్ని ఏ గుడికి రానీయకపోయినా,నన్ను సంప్రదిస్తే మీ ఇష్ట దైవం ఏదైనా గుడి నిర్మించి, విగ్రహాన్ని ప్రతిష్టించి వెళతానన్నారు. కులాలంతా ఒక్కటే మనుషులంతా ఒక్కటే స్వార్థపరుల కోసం కులాలు సృష్టించబడ్డాయి అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లేట్ల బాలస్వామి, విగ్రహ దాత మేకల అయ్యప్ప,మేకల రాజమౌళి,మాజీ మేయర్ మేకల కావ్య,మాజీ సర్పంచ్ మాలిక్,మహేష్ రావు,భీమని వెంకటయ్య,శివాజీ యూత్ కమిటీ అధ్యక్షులు భీమని శాంతి కుమార్, కార్యదర్శి రాందాస్ నాయక్,ఉప సర్పంచ్ శివప్రసాద్,వార్డు మెంబర్లు మన్యం,భీమ్రావు,శివ కృష్ణ, గూడ కాశన్న,కోట్ల లింగం,మేకల అయ్యన్న, భీం సాగర్,లేట్ల అశోక్ గ్రామ ప్రజలు, మహిళలు, చుట్టు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# బండి V/S ఈటల

**కాషాయం పార్టీలో కోల్డ్ వార్**

**కరీంనగర్ రాజకీయాల్లో అంతర్గత పోరు**

**సొంత ఇలాకాలో ఈటలకు పట్టు తగ్గుతుందా..?**

**'నా గడ్డ' అన్న హుజురాబాద్‌లోనే ఎదురుదెబ్బ**

**జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పోరాటం తప్పదా..?**

**కరీంనగర్ సెగ్మెంట్‌లో ఈటలకు బ్రేక్?**

ప్రతిఘటన, హైదరాబాద్



కాషాయ పార్టీలో కీలకంగా ఎదిగిన మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌కి మున్సిపల్ ఎన్నికల ఫలితాలు మైండ్ బ్లాంక్ చేశాయా..? సొంత ఇలాక హుజురాబాద్‌లోనే ఆయన పట్టు తగ్గిందా..? మరో ఎంపీ, కేంద్రమంత్రి బండి సంజయ్ కరీంనగర్ కార్పొరేషన్‌ను కైవసం చేసుకోవడంలో కీ రోల్ పోషించిడంతో పార్టీలో బలం, బలహీనతల సమీకరణాలు మారిపోయాయా..? ఆ క్రమంలో గ్రేటర్ సహా, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్లకు రాబోయే ఎన్నికలు ఇప్పుడు ఈటలకు ప్రతిష్టాత్మక పోరాటంగా మారబోతున్నాయా..?

**కరీంనగర్ రాజకీయాల్లో అంతర్గత పోరు**

తెలంగాణ రాజకీయాల్లో ఈటల రాజేందర్ ప్రయాణం ప్రత్యేకమైందని చెప్పవచ్చు. కానీ బీజేపీలో చేరిన తర్వాత ఆయనకు బయట రాజకీయాల కంటే అంతర్గత సమీకరణాలే పెద్ద సవాల్‌గా మారాయట. ముఖ్యంగా కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఆయన సొంత నియోజకవర్గం హుజురాబాద్‌లో నెలకొన్న పరిస్థితులు ఇప్పుడు చర్చనీయాంశం అవుతున్నాయి. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, మల్కాజ్‌గిరి ఎంపీఈటల రాజేందర్ మధ్య జరుగుతున్న కోల్డ్‌వార్‌కి మున్సిపల్ ఎన్నికలే నిదర్శనంగా నిలిచాయన్న టాక్ నడుస్తోంది. కొంతకాలంగా ఆ ఇద్దరు నేతల అనుచర వర్గాలు పరస్పరం విమర్శలు చేసుకుంటుండటం.. క్రమశిక్షణకు మారుపేరుగా చెప్పుకునే బీజేపీలో ఐక్యత .. ఎండమావిలా తయారైంది.

**'నా గడ్డ' అన్న హుజురాబాద్‌లోనే ఎదురుదెబ్బ**

హుజురాబాద్ నియోజకవర్గం ఈటల రాజకీయ జీవితానికి బలమైన పునాది వేసింది. టీఆర్ఎస్‌తో పొలిటికల్ ఎంట్రి ఇచ్చి అప్పటి కమలాపురం నియోజకవర్గం నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి, 2009తో కమలాపురం హుజూర్‌నగర్లో విలీనం అవ్వడంతో అక్కడి నుంచి గులాబీపార్టీ అభ్యర్థిగా వరుసగా నాలుగు సార్లు గెలిచి మంత్రిగా పనిచేసిన చరిత్ర ఆయనది. తర్వాత మారిన రాజకీయ పరిణామాలతో టీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరి 2021లో జరిగిన బైపోల్స్‌లో ఏడోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆ క్రమంలో హుజూరాబాద్ నా గడ్డ, ఎవ్వడు అడ్డు వచ్చినత అంతు చూస్తానని పలుమార్లు ఈటల హాట్ కామెంట్స్ చేసినప్పటికీ 2023 ఎన్నికల్లో అదే హుజూరాబాద్ నుంచి తొలిసారి ఓటమి పాలయ్యారు.

**కరీంనగర్ సెగ్మెంట్‌లో ఈటలకు బ్రేక్?**

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీగా గెలిచి ఈటల సత్తా చాటుకున్నారు. అలాంటాయన ప్రభావం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పెద్దగా కనిపించకపోవడం .. ముఖ్యంగా హుజూరాబాద్‌లో అసలు కనిపించకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. పార్టీ అంతర్గత నిర్ణయాల కారణంగా ఆయన్ని కరీంనగర్ లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలో ప్రచారానికి దూరంగా ఉంచారనే ఆరోపణలు ఈటల వర్గం నుంచి వినిపిస్తున్నాయి. అంతేకాదు కావాలనే ఈటలను కరీంనగర్ లో అడుగు పెట్టకుండా బండి సంజయ్ అడ్డుపడ్డారన్న టాక్ సైతం ఉంది.

**గులాబీ జెండా ఎగిరిన చోట కాషాయానికి కష్టాలు**

ఈటల గులాబీ పార్టీలో ఉన్నప్పుడు హుజురాబాద్ సెగ్మెంట్లోని హుజురాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీల్లో ఆ పార్టీ జెండా ఎగిరింది. అయితే తాజా ఎన్నికల్లో ఆ రెండు చోట్ల బీజేపీ పెద్దగా ప్రభావం చూపలేక, ఆశించిన ఫలితాలు రాబట్టడంలో విఫలం అయ్యింది. దాంతో బండి సంజయ్ కేవలం కరీంనగర్ కార్పొరేషన్ మీద మాత్రమే ఫోకస్ చేసి, ఆ జిల్లాల్లో మున్సిపాలిటీలను పూర్తిగా విస్మరించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కరీం నగర్ కార్పొరేషన్ మినహాయిస్తే అక్కడ ఉన్న మున్సిపాలిటీల్లో కాషాయపార్టీ ప్రభావం చూపలేకపోవడం చర్చనీయాంశమైంది.

**బండి వ్యూహం ఫలించిందా?**

ఇక కరీంనగర్ కార్పొరేషన్‌లో విజయాన్ని కేంద్రమంత్రిగా బండి సంజయ్ తన రాజకీయ ప్రతిష్టగా భావించి పనిచేశారు. అక్కడ కార్పొరేటర్‌గా పనిచేసిన అనుభవంతో స్థానికంగా పట్టుచాటుకుని, ఢిల్లీ నాయకత్వం దగ్గర మంచి మార్కులు సంపాదించారు. మరోవైపు ఈటల రాజేందర్‌ను కరీంనగర్ కాదు కనీసం తన హుజురాబాద్ సెగ్మెంట్ కు కూడా రానివ్వక పోవడం, ప్రచారం చేయనివ్వకపోవడం ఆ పార్టీలోపెద్ద దుమారమే రేపుతోంది. ఈటలను దూరం చేయడం బీజేపీకి కరీంనగర్ పార్లమెంట్ సెగ్మెంట్లో పెద్ద మైనస్ అయిందన్న టాక్ ఆ జిల్లా పార్టీ బీజేపీ వర్గాల్లో నడుస్తుందట.

**సొంత పార్టీ నుంచే సవాళ్లు...**

ఇక ఈటలను సొంత జిల్లాకు వెళ్లనివ్వకుండా ఆయనకు మల్కాజిగిరి సెగ్మెంట్‌లోని మేడ్చల్ పరిధిలోని కొన్ని మున్సిపాలిటీలను అప్పజెప్పారు. ఆ మున్సిపాలిటీల్లోనూ ఈటల పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. కొన్ని చోట్ల మద్దతు రాజకీయాలు చేసి వైస్ చైర్మన్ పదవులు తీసుకోవడం తప్ప సొంతగా బీజేపీ ఏ మున్సిపాల్టీలోనూ విజయం సాధించలేదు. దాంతో ఈటల రాజేంద్రపై సొంత పార్టీ నేతలు చేస్తున్న కుటిల రాజకీయాలకు సంబంధించి ఆయన వర్గీయులు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారట.

**మల్కాజ్‌గిరిలో అంతర్గత విభేదాలే అడ్డంకులా?**

కరీంనగర్ పంచాయితి అటుంచితే హైదరాబాద్‌ను ప్రభుత్వం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లుగా విభజించింది. అయితే మల్కాజ్‌గిరి ఎంపీగా ఉన్న ఈటెల రాజేందర్‌కు ఇప్పుడు అక్కడ రానున్న కార్పొరేషన్ ఎన్నికలు అగ్నిపరీక్షగా మారే అవకాశముంది. కరీంనగర్‌లో బండి సంజయ్ పార్టీని గెలిపించుకున్న తరహాలో ఈటల మల్కాజ్‌గిరి కార్పొరేషన్లో సత్తా చూపిస్తారా? లేక ఇక్కడ కూడాఅంతర్గత విభేదాలే అడ్డంకిగా మారతాయా..? అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

**కమలం పార్టీలో కోల్డ్‌వార్ ముదురుతుందా?**

మొత్తానికి కమలం పార్టీలో బండి, ఈటల మధ్య ఆధిపత్యపోరు మరింత ముదిరే పరిస్థితి కనిపిస్తోంది. ఒకరు కరీంనగర్ కార్పొరేషన్ గెలిచి పైచేయి సాధిస్తే, మరొకరు రాబోయే ఎన్నికల్లో తన శక్తి చాటుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది. మరి మల్కాజ్‌గిరి కార్పొరేషన్ ఫలితం ఈటల రాజకీయ భవిష్యత్తుకు టర్నింగ్ పాయింట్ అవుతుందా..? పార్టీ అంతర్గత సమీకరణాలు మారతాయా..? అన్న చర్చ మొదలైంది. అయితే ఇదంతా బండి సంజయ్ వర్గాలే కావాలని ప్రచారం చేయిస్తున్నాయని, ఈటల రాజేందర్‌పై ఉద్దేశపూర్వకంగా బురద జల్లెందుకు ప్రయత్నిస్తూ.. ఆయన ఆత్మస్థైర్యం దెబ్బతీయాలని చూస్తున్నాయని ఈటల వర్గీయులు మండిపడుతున్నారు. చూడాలి మరి కరీంనగర్ రిజల్ట్ మల్కాజిగిరిలో రిపీట్ అవుతుందా..?లేక ఈటల విషయంలో మొదటికే మోసం వస్తుందో?

## యూట్యూబర్ అన్వేష్ ఇన్‌స్టా అకౌంట్ బ్యాన్..

**1.3 మిలియన్ ఫాలోవర్స్‌తో 'నా అన్వేషణ' అకౌంట్ క్లోజ్**

**వివాదాస్పద వ్యాఖ్యలపై ఫిర్యాదు -- కేసు నమోదు**

**సిసిఎస్ పోలీసుల లేఖతో ఇన్‌స్టాగ్రామ్ యాక్షన్**

**నిబంధనల ఉల్లంఘనతో ఖాతా శాశ్వతంగా బ్యాన్**

ప్రతిఘటన, హైదరాబాద్



ప్రపంచవ్యాప్తంగా ట్రావెల్ వీడియోలతో గుర్తింపు పొందిన తెలుగు యూట్యూబర్ 'నా అన్వేషణ' (అన్వేష్) ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను యాజమాన్యం తొలగించింది. సుమారు 1.3 మిలియన్ల (13 లక్షలు) మంది ఫాలోవర్లు ఉన్న ఈ అకౌంట్ ఒక్కసారిగా కనుమరుగు కావడంతో సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. అయితే, ఈ చర్య వెనుక హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు రాసిన లేఖే ప్రధాన కారణంగా తెలుస్తోంది. గతంలో అన్వేష్ తన వీడియోల్లో భారతదేశాన్ని ఉద్దేశించి చేసిన కొన్ని వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. దేశాన్ని దూషించారనే ఆరోపణలతో నటి కరాటే కళ్యాణి హైదరాబాద్ సిసిఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు, ప్రాథమికంగా మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా , దేశ ప్రతిష్టకు భంగం కలిగించేలా పోస్ట్‌లు ఉన్నట్లు గుర్తించారు. కేసు దర్యాప్తులో భాగంగా సిసిఎస్ పోలీసులు తొలుత ఇన్‌స్టాగ్రామ్ ఫౌండర్లకు లేఖ రాసి అన్వేష్ అకౌంట్ వివరాలు సేకరించారు. ఆ వివరాలు అందిన వెంటనే, సదరు ఖాతా ద్వారా మతవిద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని, తక్షణమే ఆ అకౌంట్‌ను తొలగించాలని కోరుతూ ఇన్‌స్టాగ్రామ్ నిర్వాహకులకు మరో లేఖ రాశారు. పోలీసుల నుండి అధికారిక లేఖ అందిన వెంటనే ఇన్‌స్టాగ్రామ్ యాజమాన్యం 'నా అన్వేషణ' అకౌంట్‌ను క్షుణ్ణంగా పరిశీలించింది. నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు నిర్ధారించుకుని, తక్షణమే ఆ అకౌంట్‌ను బ్యాన్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఆ అకౌంట్ సెర్చ్ రిజల్ట్స్‌లో కనిపించడం లేదు. సోషల్ మీడియాలో విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసే వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారనడానికి ఈ ఘటనే నిదర్శనమని అధికారులు హెచ్చరిస్తున్నారు.జ

## భారతజాతి ముద్దుబిడ్డ వీరత్వం, పరాక్రమం, పౌరుషానికి ప్రతీక చత్రపతి శివాజీ



ప్రతిఘటన, మహేశ్వరం రిపోర్టర్ ముత్తయ్య

భారతజాతి ముద్దుబిడ్డ వీరత్వం పరాక్రమం, పౌరుషానికి ప్రతీక చత్రపతి శివాజీ అని నాయకులు షేక్ జహంగీర్, కపిల్ గౌడ్, శ్రీధర్ గౌడ్, వాసు బాబు, శాంత కుమార్, బోద హరికృష్ణ అన్నారు. జల్పల్లి డివిజన్ పరిధిలోని శ్రీరామ కాలనీలో చత్రపతి శివాజీ మహారాజు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ర్యాలీ తీశారు. పూజా కార్యక్రమాలు, శివాజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ పరాక్రమానికి ధైర్య సాహసాలకు నిలువుటద్దం స్వరాజ్య స్థాపకుడు చత్రపతి శివాజీ అని తెలిపారు. అపరమైన మొఘులుల సైన్యాన్ని శివాజీ చత్రపతి తన గెరిల్లా యుద్ధ తంత్రాలతో గడగడాలలించిన ధైర్యశాలి ధైర్య సాహసాలకు నిదర్శనం అని అన్నారు. భారత జాతి ముద్దుబిడ్డ గర్వించే గొప్ప నాయకుడు శివాజీ చత్రపతి మహారాజు అని కొనియాడారు.

## నూతన ఇన్స్పెక్టర్ కు సన్మానం



ప్రతిఘటన , మహేశ్వరం రిపోర్టర్ ముత్తయ్య,

పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ కు నూతనంగా విచ్చేసిన ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డి ని జల్పల్లి బీఆర్ఎస్ నాయకుడు కొంగర సుభాష్ కుర్మ ఆధ్వర్యంలో నాయకులు ఇసుకమూరి నిరంజన్, నర్సింగ్ యాదవ్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సన్మానించారు. స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో నిరంతరం పర్యవేక్షించాలన్నారు. నేరాలను నిరోధించడం, అనుమానాస్పద కదలికలను గుర్తించడం, పౌరుల భద్రతకు భరోసా కల్పించడం శాంతి భద్రతలకు కృషి చేయాలని కోరారు. సీఐ మాట్లాడుతూ చట్టాన్ని ఉల్లంఘించే వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి విక్రయాలను కార్యకర్తమన్నారు. గంజాయి సేవించే వారిపై చర్య తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై లక్ష్మయ్య పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు తీర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



ప్రతిఘటన, మహేశ్వరం రిపోర్టర్ ముత్తయ్య

ప్రశాంతి హిల్స్ డివిజన్ 58 బాలాపూర్ చౌరస్తా లోని లేబర్ అడ్డా లో రోజువారీ కూలీలు పడుతున్న ఇబ్బందులు అనేక సమస్య ఎదురుకొంటున్నారు. వాటినాన్నిటిని కమిటీ సభ్యులు , రోజువారి కూలీలు టీపీసీసీ తెలంగాణ రాష్ట్ర ప్రచారళకమిటీ సభ్యులు సామిడి గోపాల్ రెడ్డి కి వినతి పత్రం అందజేశారు. గోపాల్ రెడ్డి స్పందిస్తూ సమస్యను కె ఎల్ ఆర్ దృష్టికి తీసుకెళ్లి అతి త్వరలో పరిష్కరిస్తామని గోపాల్ రెడ్డి తెలిపారు. సమస్యలు తీర్చడమే లక్ష్యం కాంగ్రెస్ నాయకుడిగా నా బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమం లో కమిటీ సభ్యులు గట్టు వీరన్న, పన్నాల సురేష్, సత్యం, జెగన్, బుచ్చిబాబు, శ్రీశైలం, అమ్ములు, బన్నీ. సోమ్నాయక్, స్వామి, దేవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ధరవత్ స్వామిన్యాక్ , కోప్షన్ సభ్యులు రవి నాయక్ ,బాలాపూర్ మండల్ వైస్ ప్రెసిడెంట్ వరికుప్పల శివ, స్వాగత్ శ్రీనివాస్, టిక్లోళ్ల కృష్ణ, గాడి వేమ్లా కృష్ణ ఆలేటి నాని, జానయ్య నర్సిమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అన్యాయానికి వృతిరేకంగా పోరాడి పైందవ ధర్మాన్ని రక్షించిన గొప్ప వీరుడు చత్రపతి శివాజీ

ప్రతిఘటన, మహేశ్వరం రిపోర్టర్ ముత్తయ్య



అన్యాయానికి వృతిరేకంగా పోరాడి పైందవ ధర్మాన్ని రక్షించిన గొప్ప వీరుడు చత్రపతి శివాజీ అని మాజీ సింగిల్ విండో చైర్మన్ బీజేపీ సీనియర్ నాయకుడు కొలను శంకర్ రెడ్డి అన్నారు. బాలాపూర్ లో ఆయన శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొలన్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ పరిపాలన దక్షత, గెరిల్లా యుద్ధ తంత్రలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. దేశం కోసం ధర్మాన్ని రక్షించడానికి నేటి యువతి, యువకులు పోరాటం చేయల్సిన అవసరమందని, స్త్రీలను గౌరవించని రాజ్యానికి భవిష్యత్ ఉండదని వారు అన్నారు. ప్రతి ఒక్కరూ మహిళలు గౌరవించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పాల్గొన్నారు.


## శత్రువులను ధైర్యంగా ఎదుర్కొని హైందవ స్వరాజ్యాన్ని స్థాపించిన గొప్ప యోధుడు ఛత్రపతి శివాజీ



**ప్రతిఘటన , మహేశ్వరం రిపోర్టర్ ముత్తయ్య**

భారతదేశ చరిత్రలో స్వాతంత్ర్య స్ఫూర్తిని ప్రజల్లో నింపిన మహానేతల్లో ఔన్నత్యమైన స్థానం పొందిన మహారాజు ఛత్రపతి శివాజీ అని బడంగ్పేట్ బీఆర్ఎస్ నాయకుడు బోయపల్లి శేఖర్ రెడ్డి అన్నారు .శివాజి మహారాజ్ జయంతి సందర్భంగా అల్మాస్ గూడా లో శివాజీ మహారాజ్ విగ్రహానికి ఆయన పూల మాలవేసి నివాళులు అర్పించారు. శివాజీ యూత్ సభ్యులు ఏర్పాటు చేసిన రక్తదాన కార్యక్రమం లో పాల్గొన్న బోయపల్లి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ శివాజీ ధైర్యసాహసాలు, పరాక్రమం, ప్రజల పట్ల చూపిన మమకారం నేటికీ ప్రతి భారతీయునికి ప్రేరణగా నిలుస్తున్నాయని శత్రువులను ధైర్యంగా ఎదుర్కొని హిందవ స్వరాజ్యాన్ని స్థాపించిన గొప్ప యోధుడు అని కొనియాడారు.

## కర్రెగుటల్లో కుంబింగ్ నిలిపివేయాలి..
## సిపిఐ నేత కూనంనేని సాంబశివరావు



**ప్రతిఘటన, హైదరాబాద్**

కర్రెగుట్టల్లో తక్షణమే కూంబింగ్ చర్యలు తక్షణమే నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. మావోయిస్టులు చర్చలకు వచ్చేందుకు మార్గం సుగమం చేయాలని గురువారం పత్రిక ప్రకటనలో కోరారు. మావోయిస్టులు సైతం జనజీవనస్రవంతిలోకి వచ్చి, మార్క్సిస్టు సిద్ధాంతాన్ని విస్తరించేలా ఎత్తుగడలను మార్చుకోవాలని సూచించారు.

**ప్రభుత్వం తరపున కూడా కృషి చేయాలి**


అడవుల్లోని లక్షల కోట ఖనిజ సంపద కోసం మహారాష్ట్ర, చత్తీస్ గడ్ జార్ఖండ్ లో లక్షలాది చెట్లు నరికివేయడాన్ని నిలిపివేయాలన్నారు. ఒకదగ్గర చెట్టును తొలగించాలంటే, మరో ప్రాంతంలో కొత్త మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలన్న గ్రీన్ ట్రైబ్యునల్ తీర్పు ఆసరాగా ఈ చర్యలకు పాల్పడడం సమంజసం కాదని, అడవిలో ప్రకృతి సహజంగా పెరిగిన చెట్లను కొట్టేసి, ఇతర ప్రాంతంలో అన్ని చెట్లు పెంచడం సాధ్యమా అని ప్రశ్నించారు. కార్పొరేట్ ఖనిజ సంపదను అప్పగించేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నారని కూనంనేని విమర్శించారు. నక్సల్స్ పేరు చెప్పి మానవ హననానికి పాల్పడడం మానవత్వానికే మచ్చ అని అన్నారు. విశాల దృక్పథంతో ఆలోచించి వారిని జనజీవన స్రవంతిలో తీసుకురావడానికి ప్రభుత్వం తరపున కూడా కృషి చేయాలని అన్నారు

## తెలంగాణ ఏమైనా నీ అయ్య జాగీరా..?

**కేసీఆర్ జాతిపిత ఎలా అయ్యారో చెప్పాలి**

**జాతిపిత అని పిలవడానికి సిగ్గుండాలి**

**కేసీఆర్‌కు కడియం శ్రీహరి సూటి ప్రశ్న**



**ప్రతిఘటన, హైదరాబాద్**

మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఇటీవల మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేసీఆర్‌ను తెలంగాణ జాతిపిత అని సంబోధించడాన్ని ఆయన తీవ్రంగా ఆక్షేపిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు.తెలంగాణకు కేసీఆర్ జాతిపిత ఎలా అయ్యారో చెప్పాలని కడియం శ్రీహరి నిలదీశారు. జాతిపిత అని పిలవడానికి సిగ్గుండాలని.. అసలు కేసీఆర్ తెలంగాణకు చేసిందేమిటని ప్రశ్నించారు. ప్రజల సమస్యలపై స్పందించని వ్యక్తిని.. అసెంబ్లీకి రాని వ్యక్తిని జాతిపితగా ఎలా గుర్తిస్తారని ఆయన ఎద్దేవా చేశారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్రం బాగుపడటం కంటే ఆయన కుటుంబమే ఆర్థికంగా బలపడిందని శ్రీహరి ఆరోపించారు. కేసీఆర్ కుటుంబ సభ్యులంతా ఏదో ఒక స్కామ్‌లో చిక్కుకున్నారని.. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పదేళ్ల కాలంలో తెలంగాణను అప్పుల కుప్పగా మార్చేశారని.. భవిష్యత్ తరాలపై పెను భారం వేశారని మండిపడ్డారు. ఇటీవల కేసీఆర్ ఉపయోగించిన భాషపై కడియం శ్రీహరి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. 'తెలంగాణ ఏమైనా నీ అయ్య సొత్తా? నీ అయ్య జాగీరా?'అంటూ ఘాటైన పదజాలంతో ప్రశ్నించారు. అధికారం కోల్పోయినప్పటికీ కేసీఆర్‌లో అహంకారం ఏమాత్రం తగ్గలేదని.. ప్రజలను గౌరవించడం ఆయనకు రాదని విమర్శించారు. ప్రజల సమస్యలపై స్పందించకుండా ఫామ్ హౌస్‌కే పరిమితమైన కేసీఆర్ నాయకుడెలా అవుతారు?.. రాష్ట్రాన్ని లక్షల కోట్ల అప్పుల్లో ముంచిన ఘనత కేసీఆర్‌దే.. తెలంగాణ అంటే ఒకరి సొత్తు కాదు, ఇది ప్రజల పోరాట ఫలితం అంటూ ఘటా వ్యాఖ్యలు చేశారు. కడియం శ్రీహరి చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ముఖ్యంగా బిఆర్ఎస్ వైఖరిని.. కేసీఆర్ వ్యక్తిగత వ్యవహారశైలిని ఆయన టార్గెట్ చేయడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది.

## సిపిఐ(యం-ఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ నుండి
# షేక్ షావలిని నెల రోజుల ముందే బహిష్కరణ
### సిపిఐ (ఎం-ఎల్)సిపి రెడ్డి పార్టీ జాతీయ కార్యదర్శి,మల్లేపల్లి ప్రభాకర్




**హైదరాబాద్ :** సిపిఐ(యం-ఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ నుండి షేక్ షావలిని నెల రోజుల ముందే బహిష్కరించినట్లు సిపిఐ (ఎం-ఎల్) సిపి రెడ్డి పార్టీ జాతీయ కార్యదర్శి,మల్లేపల్లి ప్రభాకర్ తెలిపారు.గురువారం హైదరాగుడలో మీడియా సమావేశం లో పోలిట్ బ్యూరో మెంబర్ చిట్టి బాబు, సిపిఐ (ఎం-ఎల్) సిపి రెడ్డి పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, పోలిట్ బ్యూరో మెంబర్ సంపంగి పద్మక్క, ఖమ్మం జాతీయ అధ్యక్షురాలు, పోలిట్ బ్యురో మెంబర్, దిగంబర్, మహారాష్ట్ర పార్టీ కార్యదర్శి, పోలిట్ బ్యురో మెంబర్ తో కలిసి మాట్లాడారు. కమ్యూనిస్టు నైతిక విలువలు, మానసిక స్థైర్యం కోల్పోయి అరాచక గ్రూపులలో కలిసి పార్టీ నాయకత్వంపై పోస్టర్లు వేయడం షేక్ షావలి కమ్యూనిస్టు విలువలకు నిదర్శనమన్నారు. మెజార్టీ పోలిట్ బ్యూరో, జాతీయ కమిటీ సభ్యులకు తెలియకుండా, పార్టీ అంటే నేను నేను అంటే పార్టీ అంటూ షేక్ షావలి జాతీయ కార్యదర్శిగా ప్రకటించుకోవడమంటే ఆయన దివాలాకోరు తనానికి నిదర్శనం. గత 3 సంవత్సరాల క్రితం సిపిఐ (యం-ఎల్) రాంచంద్రన్, సి పి ఐ (యం- ఎల్) ప్రతిఘటన, సిపిఐ (యం-ఎల్) క్రాంతి సంస్థలు ఐక్యం కావడం జరిగింది. 3 పార్టీల ఐక్యతలో ప్రతిఘటన పార్టీ మొత్తం బయటకు వెళ్ళిపోయింది, దీనికి కారణం షేక్ పావలి మొనార్కిజం వల్లే జరిగింది. ప్రస్తుతం షేక్ పావలి మిగిలి ఉండి, ఈయన చేస్తున్న పార్టీ వ్యతిరేక పనులు, విలేకరిగా ఉండటం, ఔఊా, ౹జఏంఅ, ఇతర సంస్థలతో పనిచేయడం, హైదరాబాద్ లో ఏ మీటింగ్ ఉన్నా పార్టీకి తెలియకుండా జవహర్ నగర్ నుండి పార్టీ పేరుతో ప్రజలను తీసుకెళ్ళడం, ప్రజల ఖర్చులు అంటూ మీటింగ్ నిర్వాహకుల దగ్గర డబ్బులు వసూలు చేసుకోవడం దినచర్యగా మారిందని ఆరోపించారు.జనవరి 21, 22, 2026 న సంగారెడ్డిలో పోలిట్ బ్యూరో అత్యవసర సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రజా సంఘాల రద్దు విషయం చేసింది షేక్ షావలి. దీన్ని కమిటీ ఆమోదించడం జరిగింది. ఈ సందర్భంలోనే షేక్ షావలి పని విధానంపై చర్చ జరిగింది. విలేకరి, ఔఊా, ౹జఏంఅ, ఇతర ప్రజా సంఘాలతో, శాస్త్రీయ దృక్పథం లేని సంస్థలు, జెండా, ఎజెండా లేని సంస్థలను పార్టీ గుర్తించినప్పుడు వాటికి షేక్ షావలి వెళ్ళొద్దు అని పార్టీ సిరియస్ గా హెచ్చరించింది. దీనిపై పార్టీ షేక్ పావలి వివరణ కోరగా నేను పార్టీ పరంగా ఉండలేను మడికట్టు రాజకీయాలు నేను చేయను నేను వీటితోనే ఉంటాను అని వివరణ ఇవ్వడంతో పార్టీ సిరియస్ గా అలా ఉంటే పార్టీ నుండి సస్పెండ్ (బహిష్కరణ) చేయడం జరుగుతుందని అనడంతో షేక్ షావలికి తెలియజేయడం జరిగిందని వివరించారు. సమావేశం మధ్యలోనే వెళ్ళిపోయాడు. వెళ్ళిపోయిన వ్యక్తి మానసిక స్థైర్యం, విచక్షణ, నైతిక విలువలు, కమ్యూనిస్టు భావాలు మర్చిపోయి పార్టీ నాయకత్వంపై, బూర్జువా పార్టీలు సైతం తలదించుకునేలా పార్టీపై, నాయకత్వంపై పోస్టర్స్, కరపత్రాలు, సోషల్ మీడియాలో లేనిపోని ఆరోపణలతో విరుచుకుపడుతున్న షేక్ షావలి పార్టీ ప్రజా కోర్టులో నిలబెడుతుందని పార్టీ హెచ్చరించడమైనది. పార్టీ నుండి ముందుగానే బహిష్కరణకు గురైన షేక్ షావలి, జాతీయ కమిటీ సభ్యులకు, రాష్ట్ర కార్యదర్శులకు, పోలిట్ బ్యూరోకు తెలియకుండానే తనకు తాను పార్టీ జాతీయ కార్యదర్శిగా పేపర్లకు ప్రకటన ఇవ్వడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నాం. కమ్యూనిస్టు పార్టీ నైతిక విలువలు దెబ్బ తీసేలా తన చర్యలని మేధావులు, అభ్యుదయ వాదులు, ప్రజలు నమ్మవద్దని, దివాళా కోరుతనానికి పాల్పడుతున్న షేక్ షావలిని, ప్రజా సమూహం నుండి బహిష్కరించాలని మల్లేపల్లి ప్రభాకర్ విజ్ఞప్తి చేసారు.

## జన్ సేవా సంఘ్ సభ్యుడు విశ్రామ్ సరోజ్ ఇంటిపై
# దాడి చెసిన వారిపై చర్యలు తీసుకోండి

**మాధాపూర్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్‌ను కలిసి జన్ సేవా సంఘ్ సమస్య పరిష్కార కమిటీ**

**హైదరాబాద్ :** ఇస్నాపూర్ నివాసి మరియూ జన్ సేవా సంఘ్ సభ్యుడు విశ్రామ్ సరోజ్ ఇంట్లోకి ప్రవేశించి, మహిళలు మరియు పిల్లలపై దారుణంగా దాడి చేసిన సంఘటనలో పోలీసులు ఇంకా ఎటువంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయక పోవటం ఎటువంటి చర్య తీసుకోక పోవడం పై జన సేవా సంఘ్ సమస్య పరిష్కార కమిటీ కన్వీనర్ పరమానంద్ శర్మ ఆద్వర్యం లో మాధాపూర్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్‌ను కలిసి చర్య తీసుకోవాలని కోరారు. జనవరి 28న, సుమారు 8 నుండి 10 మంది స్థానికులు ఇస్నాపూర్ నివాసి మరియూ జన్ సేవా సంఘ్ సభ్యుడు విశ్రామ్ సరోజ్ ఇంట్లోకి ప్రవేశించి, మహిళలు మరియు పిల్లలపై దారుణంగా దాడి చేసినట్లు వారు పిర్యాదు చేసారు. అధికారుల నుండి సమాచారం అందుకున్న సంబంధిత అధికారి వెంటనే డిప్యూటీ కమిషనర్ ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి, త్వరలో చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. డిప్యూటీ కమిషనర్ ను సమస్య పరిష్కార కమిటీ కన్వీనర్ పరమానంద్ శర్మ, కె.డి. చౌబే, సురేష్ పండిట్,



ఎల్.ఎమ్. చౌదరి వినీత్ సింగ్, జి.డి. పాఠక్, మరియు జితేందర్ సింగ్ హాజరయ్యారు.

# చత్రపతి శివాజీ మహారాజ్ 396వ జయంతి వేడుకలు

### ఆరే కుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఇంగిలే రామారావు.

**జమ్మికుంట :** హిందూ సామ్రాజ్య స్థాపకుడు ప్రతి స్త్రీని తన తల్లిగా భావించి మాతృ మూర్తి పట్ల గల అభిమానాన్ని సమాజానికి తెలియజేసిన మహాపురుషుడు శ్రీ శ్రీ శ్రీ చత్రపతి శివాజీ మహారాజ్ 396వ. జయంతి వేడుకలు కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపల్ పరిధిలోగల ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి టెంకాయ కొట్టి పూలమాలవేసి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆరే సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇంగిలే రామారావు, మాట్లాడుతూ భరతమాత ముద్దుబిడ్డ 390 పైగా యుద్ధాలు చేసి ప్రతి ఒక్క యుద్ధంలో గెలుపు తప్ప ఓటమి ఎరుగని మహాయోధుడు అని శౌర్యం పరాక్రమం ధర్మ పాలనకు చత్రపతి శివాజీ మహారాజ్, చిహ్నం అన్నారు. జిల్లా అధ్యక్షులు రామారావు వచ్చినటువంటి ప్రముఖులకు శాలువాతో సన్మానం చేసి సాధరంగా ఆహ్వానించారు. రాష్ట్ర నాయకులు అదర్ సండే నాగేశ్వరరావు ఇంగిలే ప్రభాకర్ రావు, బాబురావు, మాట్లాడుతూ భారత దేశ ఔన్నత్యం ప్రపంచ దేశాలకు దాటిన మహా పురుషుడు చత్రపతి శివాజీ మహారాజ్ అని పర స్త్రీల పట్ల శివాజీ



వ్యవహరించిన తీరును ప్రజలకు తెలియజేశారు.రాష్ట్ర ప్రభుత్వం చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని వారు కోరారు అనంతరం ముఖ్య అతిధిగా మున్సిపాలిటీ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్), కౌన్సిలర్ కొలకాని రాజకుమారి- రాజు, కొలుగూరి సురేష్, కుడితాది తిరుపతి, ప్రముఖులు అందరూ చత్రపతి యొక్క యుద్ధ నైపుణ్యాన్ని తన పరాక్రమాన్ని తెలియజేస్తూ వారి అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడవాలని తెలిపారు. దేశ అభివృద్ధి కొరకు పాటుపడిన చత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకొని ప్రాంత అభివృద్ధి కొరకు ప్రతి ఒక్కరు పాటుపడాలని కోరారు. అందరం కలిసి కట్టుగా ఉండి ప్రాంత అభివృద్ధి చేసుకోవాలని కోరారు. మొట్టమొదటిసారిగా హిందూ సామ్రాజ్య స్థాపకుని యాత్రలో పాల్గొనడం ఎంతో ఆనందదాయకంగా ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రమేష్, సలీం, శ్రీకాంత్, తిరుపతి, వెంకటేష్, వినయ్, రాకేష్, చింటు, రంజిత్, విష్ణు, ఆరే సంక్షేమ సంఘం నాయకులు చత్రపతి శివాజీ మహారాజ్ అభిమానులు యువత పెద్ద సంఖ్యలో,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు

**కమాన్‌పూర్ :** కమాన్‌పూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో గురువారం దేశభక్తి నినాదాలతో మార్మోగింది. మహానేత చత్రపతి శివాజీ మహారాజ్ 395వ జయంతి వేడుకలను ఛత్రపతి శివాజీ యువసేన అధ్యక్షుడు మల్యాల శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ హాజరై మహానేత చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.అయితే ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది పారిశుధ్య కార్మికుల సత్కారం. సమాజ ఆరోగ్య సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న కమాన్‌పూర్ గ్రామ పంచాయతీ పారిశుద్ధ కార్మికులను యువసేన ఘనంగా సన్మానించింది. వారి సేవలకు కృతజ్ఞతగా తాజా కూరగాయలను అందజేసి అభినందనలు తెలిపింది. శివాజీ మహారాజ్ చూపిన సమానత్వ భావనను ఆచరణలో పెట్టిన ఈ చర్యకు హాజరైన వారందరూ ప్రశంసలు కురిపించారు.ఈ



కార్యక్రమంలో చత్రపతి శివాజీ యువసేన వ్యవస్థాపకులు జంగపల్లి శ్రీనివాస్,వివిధ గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజా ప్రతినిధులు, యువసేన సభ్యులు, యువకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సేవా భావం, సామాజిక బాధ్యత కలిసిన ఈ జయంతి వేడుకలు చెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమంలో గుండారం సర్పంచ్ జంగిలి పోచాలు, ఉప సర్పంచ్లు రఫిక్ సోహెల్, సిద్దిపల్లి ఉప సర్పంచ్ సతీష్ సింగల్ విండో మాజీ చైర్మన్ భాస్కరరావు, మచ్చగిరి రాము, జంగిపల్లి పెద్ద శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## బిజినెస్

### తగ్గిన బంగారం దిగుమతులు.. వెండి 56 శాతం జంప్



బంగారం, వెండి ధరలు పెరుగుతున్నప్పటికీ మనదేశంలో వీటికి గిరాకీ ఏ మాత్రం తగ్గట్లేదు. భారీ ధరల కారణంగా బంగారం విషయం లో ప్రాలు, ఇన్వెస్టర్లు కొంత తక్కువ ఆసక్తి చూపిస్తున్నప్పటికీ, వెండి విషయంలో పెద్ద ఎత్తున కొనుగోళ్లను కొనసాగి స్తున్నారు. తాజాగా వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి 9 నెలలకు సంబంధించిన గణాంకాలను విడుదల చేసింది. దీని ప్రకారం, గతేడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ మధ్య కాలంలో బంగారం దిగుమతులు 18.3 శాతం తగ్గి 522 టన్నులకు చేరింది. విలువ పరంగా దిగుమతుల బిల్లు 1.8 శాతం పెరిగి 49.4 బిలియన్ డాలర్లు(రూ. 4.48 లక్షల కోట్ల)కు చేరింది. ఇదే సమయంలో బంగారం ధరలు దాదాపు 25 శాతం మేర పెరిగాయి. అధిక ధరల కారణంగానే దిగుమతులు తగ్గాయని మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇక, వెండి విషయంలో గణాంకాలు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయి. సమీక్షించిన సమయంలో వెండి దిగుమతులు ఏకంగా 56 శాతం పెరిగి 5,727 టన్నులుగా నమోదయ్యాయి. విలువ పరంగా 7.8 బిలియన్ డాలర్లు(రూ. 70 వేల కోట్లు)గా ఉంది. ఇది అంతకుముందు ఏడాది 9 నెలల సమయంలో దిగుమతి అయిన 3.4 బిలియన్ డాలర్ల(రూ. 30.8 వేల కోట్ల) కంటే రెట్టింపు జరిగింది.

### స్వయంగా షాపింగ్ చేయనున్న ఏఐ




ఏఐ సంస్థ ఆంత్రోపిక్‌తో కలిసి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కొత్త వ్యవస్థను బుధవారం పరీక్షించింది. వినియోగ దారులు ఆంత్రోపిక్‌కు చెందిన క్లాడ్ ఏఐ యాప్ ద్వారా కిరాణా సామాగ్రి, ఆహారాన్ని ఆర్డర్ చేయడంతో పాటు, యూపీఐ ఉపయోగించి చెల్లించడాన్ని పరీక్షిస్తున్నామని ఎన్‌పీసీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోహిని రాజోలా తెలిపారు.షాపింగ్‌ను సులభతరం చేయడమే లక్ష్యంతో దీన్ని అమలు చేస్తున్నారు. ఇది విజయవంతమైతే భవిష్యత్తులో యాప్‌లను మార్చాల్సిన అవసరం లేకుండా వినియోగదారులు ఆర్డర్‌లను ఇవ్వమని, స్వయంగా చెల్లింపులు కూడా చేసేలా ఏఐని కోరవచ్చు. ప్రస్తుతం, దీన్ని కొంతమందితో పరీక్షిస్తున్నారు. బిగ్‌బాస్కెట్, జొమాటో, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ లాంటి ప్లాట్‌ఫామ్‌ల నుంచి ఏఐ షాపింగ్ చేస్తుంది. ఏఐ స్వయంగా ఖర్చు చేసేందుకు కస్టమర్లు రూ. 15,000 వరకు పరిమితిని సెట్ చేయవచ్చు.

# 2028 నాటికి 3వ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్



2027 నాటికి భారత్ ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరిస్తుందని వాణిజ్య, పరిశ్రమల మంత్రి పియూష్ గోయల్ అన్నారు. 2047 నాటికి దేశాన్ని 30-35 ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థను నిర్మించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ముంబైలో జరిగిన గ్లోబల్ ఎకనామిక్ కోఆపరేషన్ (జీఈసీ) సమ్మిట్‌లో మాట్లాడిన కేంద్ర మంత్రి.. భారత్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలతో పటిష్టమైన భాగస్వామ్యాలు, వాణిజ్య సంబంధాల విషయంలో సమర్థవంతంగా పనిచేస్తోంది. ఇతర దేశాల నుంచి నమ్మకాన్ని పొందుతున్నామని, ప్రపంచ అవసరాల ఆధారంగా దేశ వాణిజ్య, పెట్టుబడులను ప్లాన్ చేస్తున్నట్టు గోయల్ తెలిపారు. గత నాలుగేళ్లలో ప్రభుత్వం తొమ్మిది వాణిజ్య ఒప్పందాలపై సంతకం చేసింది. ఈ ఒప్పందాలు నమ్మకం, పరస్పర ప్రయోజనంపై ఆధారపడి ఉన్నాయి. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు భవిష్యత్ వృద్ధి కోసం ఉద్దేశించినవి, ఇతర దేశాలు భారత అభివృద్ధిలో భాగం కావడానికి అవకాశం ఇస్తాయని ఆయన వివరించారు. భారత ప్రభుత్వం రెండు ప్రధాన సూత్రాల ఆధారంగా వాణిజ్య ఒప్పందాలపై సంతకం చేసిందని ఆయన అన్నారు. అవి నమ్మకం, సామర్థ్యం. ఈ ఒప్పందాలపై సంతకం చేసే సమయంలోనూ ప్రభుత్వం ముఖ్యమైన రంగాలను రక్షిస్తుందని కూడా ఆయన స్పష్టం చేశారు. రాబోయే సంవత్సరాల్లో భారత ఆర్థికవ్యవస్థ చాలా వేగంగా వృద్ధి చెందుతుందని గోయల్ అన్నారు. 2047 నాటికి దేశ ఆర్థికవ్యవస్థకు 26 ట్రిలియన్ డాలర్లను జోడిస్తుంది. దేశ చరిత్రలో ఈ రకమైన వేగవంతమైన వృద్ధి ఇంతకు ముందు ఎన్నడూ చూడలేదు. గత ప్రభుత్వాలు టాయిలెట్లు వంటి ప్రాథమిక అవసరాలపై తగినంత దృష్టి పెట్టలేదని, కానీ ప్రస్తుత ప్రభుత్వం అందరి జీవన నాణ్యతను మెరుగుపరచడం, అందరినీ కలుపుకునేలా కృషి చేసిందని ఆయన వెల్లడించారు. ప్రధానంగా మౌలిక సదుపాయాలలో జరుగుతున్న మార్పులను పీయూష్ గోయల్ ప్రస్తావించారు. 5జీ ఇంటర్నెట్ మారుమూల ప్రాంతాలకు కూడా చేరిందని, మనదేశం ఇప్పుడు 500 గిగావాట్ల సామర్థ్యంతో ప్రపంచంలో రెండవ అతిపెద్ద విద్యుత్ ప్రసార నెట్‌వర్క్‌ను కలిగి ఉంది. ఆర్థిక దౌత్యం అంటే దూరంగా ఉండటానికి బదులుగా బిజినెస్ లీడర్లు, ఇంటర్నేషనల్ పార్ట్‌నర్స్ దగ్గరి సంబంధాలు కొనసాగిస్తున్నారు. ఏ దేశమైనా ఇకపై ఒంటరిగా అభివృద్ధి చెందలేవని, ప్రపంచంలోని మిగిలిన ప్రాంతాలతో కలిసి పనిచేయాలని ఆయన పేర్కొన్నారు.

### భారత్‌లో 'వాలియో' రూ. 2,100 కోట్ల పెట్టుబడులు



ప్రముఖ ఫ్రెంచ్ కార్ల విడిభాగాల తయారీ సంస్థ వాలియో దేశీయంగా భారీ పెట్టుబడులు ప్రకటించింది. భారత మార్కెట్లో 200 మిలియన్ యూరోలకు పైగా(మన కరెన్సీలో రూ. 2,146.18 కోట్లు) పెట్టుబడులు పెట్టాలని భావిస్తున్నట్టు కంపెనీ బుధవారం ప్రకటనలో తెలిపింది. దీని ద్వారా దేశంలో కంపెనీ గణనీయంగా విస్తరించే అవకాశం లభిస్తుందని, ఈ పెట్టుబడులు 'ఎలివేట్ 2028' ప్రణాళికలో భాగంగా ఉంటాయని కంపెనీ వెల్లడించింది. దీని ద్వారా 2024 నాటికి కంపెనీ అమ్మకాల విలువ 220 మిలియన్ యూరోల నుంచి 2028 నాటికి 700 మిలియన్ యూరోలకు పెరుగుతాయని అంచనా వేస్తున్నాం. కంపెనీ అమ్మకాలు రాబోయే మూడేళ్లలో మూడు రెట్లు పెరుగుతాయని వాలియో సీఈఓ క్రిస్టోఫ్ పెరిల్లాట్ చెప్పారు. అంతేకాకుండా 2028 తర్వాత కూడా కంపెనీ మరింత వేగంగా వృద్ధిని సాధిస్తుందనే నమ్మకం ఉందని అభిప్రాయపడ్డారు. భారత్‌తో పాటు అంతర్జాతీయంగా కార్ల తయారీ కంపెనీలకు పెరుగుతున్న అవసరాలను తీర్చడానికి కంపెనీ ఎలక్ట్రిక్ వాహనాల వేగవంతమైన వృద్ధిని, కృత్రిమ మేధస్సును ఉపయోగిస్తోంది. భారత్‌ను తాము ప్రపంచవ్యాప్తంగా మూడు ముఖ్యమైన మార్కెట్లలో ఒకటిగా పరిగణిస్తున్నట్టు వెల్లడించింది. కాగా, వాలియో కంపెనీ భారత మార్కెట్లో 1997 నుంచి కార్యకలాపాలను నిర్వహిస్తోంది. కంపెనీకి చెన్నై, పూణె, సనంద్, గుర్గావ్‌లో ఆరు తయారీ ప్లాంట్లు ఉన్నాయి. చెన్నై, బెంగళూరులలో గ్లోబల్ ఆర్అండ్‌డీ సెంటర్లు కూడా ఉన్నాయి. కంపెనీలో 7,500 కంటే ఎక్కువ మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

### నిస్సాన్ 7 సీట్ల ఎంపీవీ గ్రావిటీ



నిస్సాన్ మోటార్ ఇండియా 7 సీట్ల బహుళ వినియోగ వాహనం (ఎంపీవీ) గ్రావిటీని ఆవిష్కరించింది. దీని పరిచయ ధర రూ.5.65 లక్షలు (ఎక్స్-షోరూమ్). రౌండ్ ఎల్ఈడీ లైటింగ్, సిగ్నేచర్ ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్స్ విత్ ఇంటిగ్రేటెడ్ డీఆర్ఎల్స్, క్రిస్టల్ ఎడ్జ్ ఎల్ఈడీ టెయిల్ ల్యాంప్స్, ఎల్ఈడీ ఫాగ్ ల్యాంప్స్, పియానో బ్లాక్ 2డి గ్రిల్లే, ఫంక్షనల్ రూఫ్ రెయిల్స్, వైడ్-ఓపెనింగ్ డోర్స్, 20.32 సెంటిమీటర్ల ఇన్ఫోటెయిన్‌మెంట్ సిస్టమ్ విత్ వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో, యాపిల్ కార్‌ప్లే, 17.78 సెం.మీ. డిజిటల్ క్లస్టర్, వైర్‌లెస్ ఛార్జర్, వాక్ అవే లాక్, ఫ్రంట్ అండ్ రేర్ పార్కింగ్ సెన్సార్లు వంటి సదుపాయాలు ఉన్నాయి. 6 ఎయిర్‌బ్యాగ్‌లు, ఈఎస్‌సీ, టీసీఎస్, హెచ్ఎస్ఏ, బీఏఎస్ ఏబీస్ విత్ ఈబీడీ, సీట్ బెల్ట్ రిమైండర్స్ వంటి భద్రతా ఫీచర్లు ఉన్నాయి. 1.0 లీటర్, 3 సిలిండర్ నేచురల్లీ ఆస్పిరేటెడ్ పెట్రోల్ ఇంజిన్, 5-స్పీడ్ మాన్యువల్, 5-స్పీడ్ ఈజెడ్ షిఫ్ట్ (ఏఎంటీ) ఆప్షన్లలో ఈ కారు లభ్యమవుతుంది. వేరియంట్ల వారీగా విసియా రూ.5.65 లక్షలు, అసెంటా రూ.6.59 లక్షలు, ఎన్-కనెక్టా రూ.7.20 లక్షలు, టెక్నా రూ.7.91 లక్షలు, ఎన్-కనెక్టా ఏఎంటీ రూ.7.80 లక్షలు, టెక్నా ఏఎంటీ రూ.8.49 లక్షల్లో (ఎక్స్-షోరూమ్) లభిస్తాయి. బుకింగ్‌లు ప్రారంభమయ్యాయి. గ్రావిటీ తర్వాత టెక్టాన్ ఎస్‌యూవీ, లార్జ్ సెవన్ సీటర్ సి సెగ్మెంట్ ఎస్‌యూవీలను ఈ ఏడాది చివర్లో తీసుకొస్తామని నిస్సాన్ మోటార్ ఇండియా ఎండీ సౌరభ్ వత్స తెలిపారు.

# వరల్డ్‌కప్‌లో డేంజర్‌బెల్స్.. శ్రీలంకను చిత్తుగా ఓడించిన జింబాబ్వే!

## స్పోర్ట్స్






ప్రపంచకప్‌లో జింబాబ్వే డేంజర్ బెల్స్ మోగిస్తోంది. మాజీ ఛాంపియన్ ఆస్ట్రేలియాను ఓడించి ఇంటికి పంపిన ఆఫ్రికా జట్టు మరో సంచలనం ఈసారి శ్రీలంకను చిత్తు చేసింది. నాకౌట్‌కు అజేయంగా దూసుకెళ్లాలనుకున్న ఆతిథ్య జట్టు ఆశలపై నీళ్లు చల్లింది. బౌలర్ల కృషిని నిలబెడుతూ.. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్(63 నాటౌట్), కెప్టెన్ సికిందర్ రజా(45)లు చెలరేగిపోగా.., పొట్టి క్రికెట్ చరిత్రలో రెండో అత్యధిక ఛేదనతో రికార్డు నెలకొల్పింది. తద్వారా ఆసీస్‌పై విజయం గాలివాటం కాదని.. తమలో విజయకాంక్ష రగులుతూనే ఉందని పెద్ద జట్లకు హెచ్చరికలు పంపింది సికిందర్ రజా బృందం. ప్రపంచకప్‌లో ఆడడమే కాదు అద్భుత విజయాలతో వార్తల్లో నిలుస్తోంది జింబాబ్వే. రెండో లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై 23 పరుగుల విజయంతో అందర్నీ ఆశ్చర్యపరిచిన ఆఫ్రికా జట్టు.. చివరి లీగ్ మ్యాచ్‌లో శ్రీలంకపై పంచ్ విసిరింది. ఆల్‌రౌండ్ షోతో ఆతిథ్య జట్టును కట్టడి చేసిన జింబాబ్వే.. ఛేదనలోనూ దుమ్మురేపింది. ఓపెనర్లు బ్రియాన్ బెన్నెట్(63 నాటౌట్), మరుమణి(34)లు లంక బౌలర్లను ధీటుగా ఎదుర్కొని.. శుభారంభమిచ్చారు. దూకుడే మంత్రగా చెలరేగిన ఈ జోడీ పవర్ ప్లేలోనే 54 రన్స్ పిండుకుంది. ఎట్టకేలకు ఈ ద్వయాన్ని వెల్లలాగే విడదీసినా.. సికిందర్ రజా(45) వస్తూనే తుఫాన్‌లా ముంచెత్తాడు. ఎదుర్కొన్నది 26 బంతులో అయినా.. ఎడాపెడా బౌండరీలు బాదిన రజా.. లంక నుంచి మ్యాచ్‌ను లాగేసుకున్నాడు. అతడి విధ్వంసానికి హేమంత తెరదించగా.. ముసెకీవా(1) గాల్లోకి లేపిన బంతిని శనక డైవ్ చేస్తూ అద్భుతంగా అందుకున్నాడు. నాలుగో వికెట్ పడినా అప్పటికి జింబాబ్వే విజయానికి10 రన్స్ కావాలి. మున్యోంగా(8 నాటౌట్).. చివరిబంతికి సింగిల్ తీశాడు. చివరి ఓవర్లో 8 రన్స్ కొట్టాల్సిరాగా.. థీక్షణ వేసిన తొలి బంతికి మున్యోంగ మిడ్‌వికెట్‌లో సిక్సర్ బాదేశాడు. రెండో బతికి సింగిల్.. విక్టరీ రన్ కొట్టాడు. అంతే.. వికెట్ల 6 తేడాతో జింబాబ్వే జయభేరి మోగించింది.

**నిశాంక హాఫ్ సెంచరీ..**

చివరి లీగ్ మ్యాచ్‌లో శ్రీలంక ఓపెనర్ పథుమ్ నిశాంక(62) అర్ధ శతకంతో చెలరేగాడు. వేదికగా జింబాబ్వే బౌలర్లను ఉతికేస్తూ అర్ధ శతకంతో కదం తొక్కాడు. బ్లెస్సింగ్ ముజరబని(2-38), ఎవాన్స్(2-35) మిడిల్ ఓవర్లలో వికెట్ల వేటతో పరుగులు కట్టడి చేసినా.. పవన్ రత్ననాయకే(44) మెరుపు ఇన్నింగ్స్ ఆడడాడు. చివరి ఓవర్లో దునిత్ వెల్లలాగే(15 నాటౌట్) మూడు బౌండరీ బాదగా శ్రీలంక 178 స్కోర్ చేసింది.

### మహిళా క్రికెట్‌లో మహారాణి.. దిగ్గజాలను దాటేసిన హర్మన్‌ప్రీత్..!




వన్డే వరల్డ్‌కప్ విజయంతో భారత మహిళా క్రికెట్ సుదీర్ఘ కలను సాకారం చేసిన హర్మన్‌ప్రీత్ కౌర్ (ఝుతీఝుఅజూతీవవ్ ఖుబతీ) కొత్త ఏడాదిలో చరిత్ర సృష్టించింది. టీమిండియాకు తొలి ఐసీసీ ట్రోఫీ అందించిన సారథిగా అప్పుడు రికార్డు నెలకొల్పిన తను.. ఈసారి దిగ్గజాలకు సాధ్యమవ్వని ఘనత సొంతం చేసుకుంది. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన మహిళగా హర్మన్‌ప్రీత్ అవతరించింది. ఆస్ట్రేలియా గడ్డపై గురువారం రెండో టీ20లో ఆడడం ద్వారా హర్మన్‌ప్రీత్ ఈ ఫీట్ సాధించింది. దూకుడైన ఆటతో భారత జట్టులో కీలక బ్యాటర్‌గా ఎదిగిన హర్మన్‌ప్రీత్ కౌర్ తనపేరిట పలు రికార్డులు రాసుకుంటోంది. సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ.. టీమిండియాను విశ్వవిజేతగా నిలిపిన హర్మన్‌ప్రీత్.. అత్యధిక మ్యాచ్‌లు ఆడేసింది. అంతర్జాతీయ క్రికెట్‌లో న్యూజిలాండ్ సీనియర్ బ్యాటర్ సుజీ బేట్స్ రికార్డును బ్రేక్ చేస్తూ... 356వ మ్యాచ్‌లో ఆడింది భారత కెప్టెన్. చిన్నప్పటి నుంచి క్రికెట్టే ధ్యాసగా పెరిగిన ఈ పంజాబీ కెరటం 2009లో అరంగేట్రం చేసింది. అనతికాలంలోనే మూడు ఫార్మాట్లలోనూ పాతుకుపోయింది. ఇండియా తరపున మిథాలీ రాజ్( వీఱ్థుశ్రీఱ ఖుయ)ను ఎప్పుడో అధిగమించిన హర్మన్‌ప్రీత్.. ఆస్ట్రేలియా గడ్డపై బేట్స్‌ను వెనక్కి నెట్టేసింది. ఇప్పటివరకూ ఆరు టెస్టులు, 161 వన్డేలు, 189 టీ20లు ఆడింది. అత్యధిక మ్యాచ్‌లు ఆడిన మహిళా క్రికెటర్ల జాబితాలో ఎలీసా పెర్రీ (ఆస్ట్రేలియా) 349, మిథాలీ రాజ్(భారత్) 333, చార్లొట్టే ఎడ్వర్డ్స్ (ఇంగ్లండ్) 309, సోఫీ డివైన్(న్యూజిలాండ్) 305 మ్యాచ్‌లతో తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు.

### భారత్‌పై ప్రతీకారం తీర్చుకున్న ఆస్ట్రేలియా




మహిళల ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు స్వదేశంలో టీమిండియాతో మల్టీ ఫార్మాట్ సిరీస్ ఆడుతుంది. ఇందులో తొలుత 3 మ్యాచ్‌ల టీ20 సిరీస్ ప్రారంభం కాగా.. భారత్ తొలి మ్యాచ్‌లోనే ఆతిథ్య జట్టుకు షాకిచ్చి తమ ఆధిక్యతను ప్రదర్శించింది. ఈ మ్యాచ్‌లో ఎదురైన పరాభవానికి ఆసీస్ రెండో మ్యాచ్‌లోనే ప్రతీకారం తీర్చుకుంది. కాన్‌బెర్రా వేదికగా ఇవాళ (ఫిబ్రవరి 19) జరిగిన రెండో టీ20లో ఆసీస్ 19 పరుగుల తేడాతో భారత్‌ను చిత్తు చేసింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్.. ఓపెనర్లు జార్జియా వాల్ (57 బంతుల్లో 88; 11 ఫోర్లు, సిక్స్), బెత్ మూనీ (39 బంతుల్లో 46; 4 ఫోర్లు) సత్తా చాటడంతో నిర్ణీత 20 ఓవరల్లో 5 వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసింది. తొలుత వాల్-మూనీ ధాటికి తడబడిన భారత బౌలర్లు.. చివరి 5 ఓవర్లలో అనూహ్యంగా పుంజుకున్నారు. వాల్-మూనీ తొలి వికెట్‌కు 14.5 ఓవర్లలో 128 పరుగులు జోడించినా.. అరుంధతి రెడ్డి (4-0-20-2), శ్రీచరణి (3-0-28-0), రేణుకా ఠాకూర్ (4-0-27-1) ఊహించని విధంగా పుంజుకొని ఆసీస్‌ను భారీ స్కోర్ చేయకుండా నిలువరించారు. వాల్, మూనీ మినహా ఆసీస్ ఇన్నింగ్స్‌లో ఒక్కరు కూడా రాణించలేకపోయారు. లిచ్‌ఫీల్డ్ 6, ఎల్లిస్ పెర్రీ 7, గార్డ్‌నర్ 10 (నాటౌట్), జార్జియా వేర్హమ్ డకౌటయ్యారు. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన భారత్‌ను ఆసీస్ బౌలర్లు కలిసికట్టుగా రాణించి ఓడించారు. ఆష్లే గార్డ్‌నర్ (4-0-22-3), కిమ్ గార్త్ (3-0-16-2), అన్నాబెల్ సదర్‌ల్యాండ్ (4-0-18-2), సోఫీ మోలినెక్స్ (4-0-37-2) ధాటికి భారత్ నిర్ణీత ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 144 పరుగులకే పరిమితమైంది. భారత ఇన్నింగ్స్‌కు షఫాలీ వర్మ (29), స్మృతి మంధన (31) శుభారంభం అందించినా, ఆతర్వాత వచ్చిన వారు ఆ ఊపును కొనసాగించలేకపోయారు. కెప్టెన్ హర్మన్ (36) కాసేపు పోరాడినప్పటికీ.. ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. భారత ఇన్నింగ్స్‌లో పై ముగ్గురితో పాటు రిచా ఘోష్ (19), క్రాంతి గౌడ్ (12 నాటౌట్) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. జెమీమా రోడ్రిగ్స్ (4), అమన్‌జోత్ (3), అరుంధతి రెడ్డి (2) సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితం? కాగా.. దీప్తి శర్మ, శ్రీచరణి ఖాతా కూడా తెరవలేకపోయారు. కాగా, మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో భారత్ తొలి టీ20లో 21 పరుగుల తేడాతో (డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో) విజయం సాధించింది. నిర్ణయాత్మకమైన మూడో టీ20 ఫిబ్రవరి 21న అడిలైడ్ వేదికగా జరుగనుంది. ఈ ఆసీస్ పర్యటనలో భారత్ టీ20ల తర్వాత మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్, ఆతర్వాత ఏకైక టెస్ట్ మ్యాచ్ కూడా ఆడనుంది.



# సైకాలజికల్ థ్రిల్లర్‌తో భయపెట్టేందుకు సిద్ధమైన అనుపమ పరమేశ్వరన్

సౌత్ ఇండియాలో స్టార్ ఇమేజ్ సొంతం చేసుకున్న అనుపమ పరమేశ్వరన్, ఇప్పుడు ఒక ఇంటెన్స్ సైకాలజికల్ థ్రిల్లర్ మూవీకి సైన్ చేశారు. ఎస్ కే గీ ఎంటర్టైన్మెంట్ , బెంచ్‌మార్క్ స్టోరీటెల్లర్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఆర్జే షాన్ దర్శకత్వం వహించనుండగా.. శివిన్ నారంగ్, ప్రేరణ అరోరా, కిరణ్ బల్లపల్లి నిర్మాతలుగా వ్యవహరించనున్నారు. గతంలో అనుపమ, దర్శకుడు ఆర్జే షాన్ కాంబినేషన్‌లో వచ్చిన షార్ట్ ఫిల్మ్ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై సూపర్ హిట్ అయ్యింది. ఇప్పుడు అదే కాంబో బిగ్ స్క్రీన్‌పై రచ్చ చేసేందుకు సిద్ధమైంది. అనుపమ పుట్టినరోజు సందర్భంగా ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించిన మేకర్స్, సినిమా షూటింగ్‌ను మే నెలలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. త్వరలోనే ఈ మూవీ టైటిల్‌ను కూడా అనౌన్స్ చేయనున్నారు. 'కార్తికేయ 2', 'రాక్షసుడు' వంటి చిత్రాలతో థ్రిల్లర్ జానర్‌లో తనకంటూ ఒక ముద్ర వేసుకున్న అనుపమ, ఈ సినిమాతో మరోసారి ప్రేక్షకులను భయపెట్టిస్తూనే అలరించబోతోంది. నిర్మాత ప్రేరణ అరోరా గతంలో రుస్తుం, టాయిలెట్: ఏక్ ప్రేమ్ కథ, ప్యాడ్ మ్యాన్, పరి వంటి విజయవంతమైన చిత్రాలతో జాతీయ స్థాయి గుర్తింపు పొందారు. ఇక ఇప్పుడు అనుపతో మూవీ చేయబోతుండటంతో.. అందరిలో ఆసక్తి నెలకొంది. అనుపమ విషయానికి వస్తే.. ప్రేమమ్, కార్తికేయ 2, రాక్షసుడు వంటి హిట్ సినిమాలతో తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో మంచి క్రేజ్ సంపాదించుకుంది. ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీ బిజీగా గడుపుతోంది.




# ఆ స్టార్ హీరో అంటే చాలా ఇష్టం

టాలీవుడ్ యువ నటుడు అశోక్ గల్లా ప్రధాన పాత్రలో రూపొందిన దేవకి నందన వాసుదేవా అనే చిత్రంతో మానస వారణాసి తెలుగు సినీ పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమా పెద్ద స్థాయి విజయాన్ని సొంతం చేసుకోలేదు. దానితో ఈ బ్యూటీకి ఈ మూవీ ద్వారా పెద్దగా గుర్తింపు దక్కలేదు. ఈ సినిమా తర్వాత ఈమెకు కాస్త ఎక్కువగానే గ్యాప్ వచ్చింది. తాజాగా ఈమె సంతోష్ శోభన్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన కపుల్ ఫ్రెండ్లీ చిత్రంలో హీరోయిన్గా నటించింది. తాజాగా విడుదల అయిన ఈ సినిమాకు మంచి టాక్ రావడం జరిగింది. ఈ చిత్రంలో ఈమె తన నటనతో ప్రేక్షకులను బాగా ఆకట్టుకోవడం వల్ల ఒక్కసారిగా మానసకి టాలీవుడ్ ఇండస్ట్రీలో మంచి గుర్తింపు దక్కింది. ప్రస్తుతం కపుల్ ఫ్రెండ్లీకి మంచి ప్రేక్షకాదరణ దక్కుతుండడంతో ఈ ముద్దుగుమ్మ ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషన్లను పెద్ద ఎత్తున నిర్వహిస్తూ వస్తుంది. తాజాగా ఈమె ఓ ఇంటర్వ్యూలో పాల్గొంది. అందులో ఈమెకు తెలుగు సినిమా పరిశ్రమలో ఏ నటులు అంటే ఇష్టం? ఎవరితో సినిమా చేయాలని ఉంది అనే విషయాలను తెలియజేసింది. తాజాగా మానస వారణాసి మాట్లాడుతూ... నేను చిన్న వయసు నుండి టాలీవుడ్ స్టార్ హీరోలు అయినటువంటి మహేష్ బాబు, నాగార్జున, వెంకటేష్ సినిమాలు చూస్తూ పెరిగాను. వారి నటన చాలా ఇష్టం. వారిపై నాకు ఎంతో గౌరవం ఉంది. ఇక నాకు మహేష్ బాబు గారు అంటే చాలా చాలా ఇష్టం. ఆయనతో కలిసి నటించే అవకాశం వస్తే బాగుంటుందని అనుకుంటున్నట్లు ఈమె తాజాగా చెప్పుకొచ్చింది.

## నటుడిని కాబట్టే బతికిపోయాను

టాలీవుడ్ హీరో రానా దగ్గుబాటి హీరోగా, విలన్‌గా నటించి ఎంతోమంది ప్రశంసలు పొందారు. బాహుబలి చిత్రాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. 'బాహుబలి 2' ఘనవిజయం తర్వాత రానా కెరీర్ పీక్స్‌లో ఉన్న సమయంలోనే ఆయన అనారోగ్యం బారిన పడ్డారు. తాజాగా, రానా తన ఆ చేదు అనుభవాలను ఓ పాడ్‌కాస్ట్‌లో వెల్లడించారు. అమెరికాలో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకుని ప్రాణాలతో తిరిగి రావడం ఒక ఎత్తైతే, ఆ తర్వాత శారీరకంగా వచ్చిన మార్పులను అంగీకరించడం మరో ఎత్తని చెప్పుకొచ్చారు. ఒకప్పుడు కండలు తిరిగిన భల్లాలదేవుడిగా కనిపించిన తాను, చికిత్స తర్వాత నీరసించిపోయి గుర్తుపట్టలేనంతగా మారిపోయానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమయంలో తన రూపం మారిపోవడంతో, అప్పటికే సంతకం చేసిన భారీ సినిమాల అడ్వాన్స్‌లను వెనక్కి ఇచ్చేసినట్లు రానా వెల్లడించారు. అసలు తనను తానే గుర్తుపట్టలేని స్థితికి చేరుకున్నట్లు తెలుపుతూ.. "ఆ సమయంలో నేను కేవలం బతికి బయటపడాలనే ఆలోచనతోనే ఉన్నాను. కానీ ఏడాది తర్వాత అద్దంలో చూసుకుంటే నా పాత రూపం కనిపించలేదు. ఒక భారీ రెజ్లర్ కథతో సహా మరికొన్ని పెద్ద సినిమాలు చేయాల్సి ఉంది. కానీ అద్దంలో కనిపిస్తున్న వ్యక్తి ఏమాత్రం ఆ పాత్రలకు సరిపోయేలా లేడు. అందుకే నేను 'హాట్ గాయ్' ఇమేజ్ కోల్పోయానని భావించి, ఆ నిర్మాతలకు డబ్బులు తిరిగి ఇచ్చేశాను" అని రానా తెలిపారు.



## చీరకట్టులో ఆండ్రియా అందాల చిరుజల్లు

మోస్ట్ బ్యూటిఫుల్ సింగర్ మరియు నటి అయిన ఆండ్రియా గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఈమె ఎక్కువ తమిళ సినిమాల్లో నటించింది. ఆండ్రియా తెలుగులో తక్కువ సినిమాల్లో నటించినప్పటికీ వాటి ద్వారా మంచి గుర్తింపును సంపాదించుకుంది. ఇప్పటివరకు ఈ బ్యూటీ చాలా సాంగ్స్ పాడింది, స్టేజ్ షోలు కూడా చేసింది. ఈ సింగర్ చాలా సినిమాల్లో తన అందాలతో ప్రేక్షకులను కట్టిపడేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ ముద్దుగుమ్మ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటూ వస్తుంది. ఎప్పటికప్పుడు తనకు సంబంధించిన అనేక విషయాలను తన అభిమానులతో పంచుకుంటుంది. దాంతో ఈమెకు సోషల్ మీడియా అకౌంట్లో పెద్ద ఎత్తున ఫాలోవర్స్ ఉన్నారు. వీలు చిక్కినప్పుడల్లా ఈ చిన్నది తనకు సంబంధించిన హాట్ లుక్ లో ఉన్న ఫోటోలను కూడా పోస్ట్ చేస్తూ వస్తుంది. అందులో చాలా వరకు వైరల్ అయిన సందర్భాలు కూడా ఉన్నాయి. తాజాగా ఆండ్రియా ఒక ఫోటోషూట్ ను నిర్వహించింది. అందులో ఈమె బ్లూ కలర్ లో ఉన్న శారీని కట్టుకొని అందుకు తగిన బ్లౌజ్ను ధరించి తన ఫ్రంట్ అండ్ బ్యాక్ అందాలు ప్రదర్శితమయ్యేలా స్టిల్స్ ఇచ్చింది. ఈ ఫోటోలలో ఈమె తన అందమైన లుక్స్ తో చీరకట్టుతో యువతను ఆకట్టుకునే విధంగా ఉంది. దాంతో ఈ హాట్ బ్యూటీకి సంబంధించిన చీరకట్టులో ఉన్న ఫోటోలు తెగ వైరల్ అవుతున్నాయి.



# సత్యదేవ్- ఫరియా కాంబో ఫిక్స్.



హీరో సత్యదేవ్ తన కొత్త చిత్రానికి శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్ట్ ఆయన 15వ ప్రాజెక్ట్‌గా రాబోతుండగా.. వర్కింగ్ టైటిల్‌తో త్రిశూల్ విజినరీ స్టూడియోస్ బ్యానర్ పై బి.నరేంద్ర రెడ్డి నిర్మిస్తున్నారు. కంప్లీట్ ఎంటర్‌టైనింగ్ స్క్రిప్ట్‌తో దర్శకుడు లక్ష్మీనారాయణ పుట్టంచెట్టి తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో ఫరియా అబ్దుల్లా నాయికగా నటిస్తోంది. తాజాగా, హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో ఈ మూవీ పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవానికి బ్లాక్ బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి ముఖ్య అతిథిగా హాజరై హీరో హీరోయిన్లపై క్లాప్ ఇచ్చారు. యంగ్ ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి కెమెరా స్విచ్ ఆన్ చేయగా.. లక్ష్మీనారాయణ ఫస్ట్ షాట్‌కు డైరెక్షన్ చేశారు. ఈ సందర్భంగా అతిథిగా వచ్చిన ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి మాట్లాడుతూ.. నా స్నేహితుడు ప్రొడ్యూసర్ నరేంద్ర మరో మంచి చిత్రాన్ని చేస్తున్నారు. హీరో సత్యదేవ్ గారు ఒక ఔట్ అండ్ ఔట్ ఎంటర్ టైనర్ లో నటిస్తున్నారు. ఈ సినిమా ఆయనకు బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ అవుతుంది. ఈ సినిమా సాధించబోయే విజయం గురించి తర్వాత మళ్లీ మాట్లాడుతాను. డైరెక్టర్ లక్ష్మీనారాయణకు కూడా ఈ సినిమా మంచి పేరు తీసుకొస్తుంది. ఈ టీమ్ అందరికీ కంగ్రాట్స్ చెబుతున్నా. అన్నారు. డైరెక్టర్ లక్ష్మి నారాయణ పుట్టంచెట్టి మాట్లాడుతూ.. మా సినిమా జానర్ ఏంటి అని అందరూ అడుగుతున్నారు. అందరి పెదాలపై నవ్వుల పూయించే చిత్రమిది. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్‌కు వెళ్తున్నాం. రామ్ మిరియాల అన్న మా సినిమాకు మంచి మ్యూజిక్ చేస్తున్నారు. ఫస్ట్ టైమ్ ఒక కంప్లీట్ మూవీకి ఆయన సంగీతాన్ని అందిస్తున్నారు. సత్యదేవ్ గారి కెరీర్ లో ఇదొక పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నా. మాకు సపోర్ట్ చేసేందుకు ఇక్కడికి వచ్చిన అతిథులకు, మీడియా మిత్రులకు థ్యాంక్స్ చెప్పారు.

PRINTED AND PUBLISHED BY KANUGULA SRINIVAS ON BEHALF OF VIPLAV MEDIA PVT. LTD. AT M/S SMIL YS ONLINE, H-NO : 6-7-48 VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY DIST, TELANGANA - 500070 AND PUBLISHED AT VIPLAV MEDIA PVT LTD. H-NO: 18-7-496 KANDIKAL GATE, CHARMINAR, HYDERABAD, TELANGANA - 500053. CEO & CHEIF EDITOR: VANGA NAGARAJU, EDITOR: VANGA VIPLAV. UDYAM- TS-02-0308842 PHONE NO: +919394517067, +918499094183.